www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☎ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar**

హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 207 | బుధవారం | 8 జనవరి, 2025

## గురుకులంలో మరోసారి ఫుడ్ పాయిజన్

### 30 మంది విద్యార్థులకు అస్వస్థత



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శర్మనగర్ మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. క్యాలీఫ్లవర్ కూరతో విద్యార్థినులకు పెట్టడంతో వారికి కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు కావడంతో హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

02

## కేటీఆర్‌కు హైకోర్టు షాక్



- ఏసీబీ కేసులో క్వాష్ పిటిషన్ కొట్టివేత
- విచారణకు ఏసీబీకి అనుమతించిన హైకోర్టు

**ప్రజానావ, హైదరాబాద్:** కేటీఆర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు.

మిగతా 2 లో



## కార్ రేసు కేసు
# కీలక మలుపు

- సుప్రీంలో ప్రభుత్వం కేవియట్ పిటిషన్
- కేటీఆర్‌కు ముందే పిటిషన్ దాఖలు చేయడంతో ఖంగు

03

## అత్యంత రిచెస్ట్ పార్టీ
# బీఆర్ఎస్



- అంతగా డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో తేలాలి
- కెటిఆర్‌లో కొత్త సంవత్సరం స్పిరిట్ పెరిగింది
- సిరిసిల్లలో 2వేల ఎకరాల భూమి హాంఫట్
- భూముల అన్యాక్రాంతంపై ఫోరెన్సిక్ ఆడిట్
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02



## ఆశారాం బాపుకు మధ్యంతర బెయిల్

ఆరోగ్య కారణాలతో మంజూరు చేసిన సుప్రీం

02



## కిమ్స్‌లో శ్రీతేజకు పుష్ప పరామర్శ

నిర్మాత దిల్‌రాజ్‌తో కలిసి ఆస్పత్రికి రాక

03



03

## కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు

మీడియా సమావేశంలో హరీష్ రావు వివరణ

## ఫోకస్ పెట్టండి



- అభివృద్ధి పనుల డీపీఆర్ లు సిద్ధం చేయండి
- ఏప్రిల్ ఆఖరు నాటికి టెండర్లు పిలిచేలా చూడండి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ప్రజానావ, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం, ప్రణాళికలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. శంషాబాద్ ఏయిర్ పోర్టు - ఫ్యూచర్ సిటీ, ప్యారడైజ్ - మేడ్చల్, జేబీఎస్ - శామీర్ పేట్ మెట్రో కారిడార్ల నిర్మాణాలకు సంబంధించి మార్చి ఆఖరులోపు డీపీఆర్‌లు సిద్ధం చేసి కేంద్ర ఆమోదం పొంది, ఏప్రిల్ ఆఖరు నాటికి టెండర్లు పిలిచేలా ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో
# భారీ భూకంపం



- 95కు చేరిన భూకంప మృతులు
- భారత్‌లోనూ సరిహద్దు ప్రాంతాల్లో ప్రకంపనలు

న్యూఢిల్లీ: నేపాల్ సరిహద్దుల్లో టిబెట్ సమీపంలో మంగళవారం ఉదయం భూకంపం సంభవించిన ఘటనలో 95 మంది మరణించారు. అంతకంతకూ మృతుల సంఖ్యల పెరుగుతోంది. అలాగే భారత్‌లోని పలు ప్రాంతాలు.. బిహార్, అసోం, పశ్చిమ బెంగాల్‌లో సైతం భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి.

02



# బీజేపీ VS కాంగ్రెస్

## ప్రియాంకపై బీజేపీ నేత అనుచిత వ్యాఖ్యల ఎఫెక్ట్





## నాంపల్లిలో హైటెన్షన్



- తలలు పగిలేలా కొట్టుకున్న కార్యకర్తలు
- గాంధీభవన్ ముట్టడికి యత్నం
- ఫ్లెక్సీలు చించేసిన బీజేపీ శ్రేణులు
- లాఠీచార్జి చేసిన పోలీసులు.. పలువురి అరెస్ట్
- దాడిని ఖండించిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్, అరవింద్ తదితరులు

నాంపల్లిలోని బీజేపీ ఆఫీస్ వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. యూత్ కాంగ్రెస్ బీజేపీ ఆఫీసును ముట్టడికి ప్రయత్నించింది. కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీకి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో గొడవ మొదలైంది. దీంతో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పరం కర్రలతో దాడి చేసుకున్నారు. కర్రలతో కొట్టుకోవడంతో పాటు ఇరు పార్టీల కార్యకర్తలు రాళ్లు,కోడిగుడ్లు విసురుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ కార్యకర్త తలకు గాయమైంది. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ ప్రియాంక గాంధీపై ఢిల్లీకి చెందిన బీజేపీ నేత రమేష్ బిదూరీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ రోడ్లను ప్రియాంక గాంధీ బుగ్గల్లా మారుస్తామని బీజేపీ నేత రమేశ్ బిదూరీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. నాంపల్లిలోని బీజేపీ ఆఫీసు ముట్టడికి ప్రయత్నించారు.

## తలచుకుంటే గాంధీభవన్ పునాదులు ఉండవు

ఘాటుగా హెచ్చరించిన బండి, ఏలేటి, ధర్మపురి



02

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# నాంపల్లిలో హైటెన్షన్





**ప్రజానావ, హైదరాబాద్:** బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు పరస్పర దాడులతో హైదరాబాద్ నాంపల్లి ప్రాంతంలోని ఈ రెండు పార్టీ ఆఫీసుల వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై ఢిల్లీ బీజేపీ కాల్కాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ బిదురి చేసిన వ్యాఖ్యలపై వివాదం కొనసాగుతోంది. రమేష్ బిదురి వ్యాఖ్యలకు నిరసనగా, రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ కేంద్ర మంత్రులను అడ్డుకోవాలని యూత్ కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ కార్యకర్తలు హైదరాబాద్ నాంపల్లి బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేసి, రమేష్ బిదూరి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ దాడిలో ఓ బీజేపీ కార్యకర్త తలకు తీవ్ర గాయాలపాలయ్యాడు. దీనికి ప్రతిగా, కోపోద్రిక్తులైన బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్తలపై కర్రలతో దాడి చేయడానికి ప్రయత్నించడంతో, ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. తరవాత బిజెపి కార్యకర్తలు దాడికి దిగడంతో గాంధీ భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ భవన్ ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున రావడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పెద్దఎత్తున గాంధీ భవన్ వద్దకు చేరుకున్న కాషాయం కార్యకర్తలు అక్కడ ఉన్న ఫ్లెక్సీలను చింపివేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఇరు వర్గాల మధ్య పెద్దఎత్తున ఘర్షణ జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో బీజేపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు వారిని అరెస్టు చేశారు. తెలంగాణలో బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి తీవ్ర రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దాడిని దురదృష్టకరంగా అభివర్ణిస్తూ, ప్రభుత్వ వైఫల్యాన్ని బహిర్గతం చేస్తున్నారు. దాడి అనంతరం, బీజేపీ కార్యకర్తలు గాంధీభవన్‌ను ముట్టడించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ పోలీసులు అప్రమత్తమై బీజేపీ శ్రేణులను అడ్డుకోవడంతో, గాంధీభవన్ వైపుగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో, బీజేపీ కార్యకర్తలు రాళ్ల దాడి చేస్తుండగా, పోలీసులు వారిని నియంత్రించేందుకు లాఠీచార్జ్ చేశారు. పలువురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు, ఈ ఘటన తర్వాత బీజేపీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు చేరుకుని నిరసనలు వ్యక్తం చేసారు.

# గురుకులంలో ఫుడ్ పాయిజన్



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలోని గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ పరంపర కొనసాగుతూనే ఉంది. సీఎం, మంత్రులు గురుకులాల బాట పట్టినా విద్యార్థుల హాస్టల్స్‌లో ఎలాంటి మార్పులు రావడం లేదు. రోజు రోజుకు విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతూ పిట్టల్లా రాలిపోతున్నారు. తాజాగా కరీంనగర్ పట్టణం శర్మ నగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాత్రి 12గంటలకు విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో 19 మందిని పాఠశాల సిబ్బంది ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, రాష్ట్రంలోని గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఫుడ్ పాయిజన్ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మెస్‌చార్జీలు పెంచి, నాణ్యమైన భోజనం పెడుతున్నాక కూడా విద్యార్థులు ఎందుకు దవాఖానల పాలవుతున్నారో ప్రభుత్వం చెప్పాలని నిలదీస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో ఓ వెలుగు వెలిగిన గురుకులాలు కాంగ్రెస్ పాలనలో మృత్యు కుహరాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గురుకుల సంస్థలో ఖాళీలు

**65 ఐ.టి, రెండు పీఆర్ఓ ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం**

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో 65 ఐ.టి. ఇన్స్ట్రక్టర్, ఇద్దరు పీఆర్ఓ పోస్టులను భర్తీ చేయడానికి నేటి నుండి ఈనెల 10 వతేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గురుకుల విద్యాలయాల సంస్థ ప్రకటించింది. ఐ.టి. ఇన్స్ట్రక్టర్లకు ఎంటెక్, బీటెక్, ఎంసీఏ లలో కంప్యూటర్స్ పూర్తి చేసిన వారు, పీఆర్ఓ పోస్టులకు జర్నలిజంలో డిగ్రీ పూర్తి చేసి కనీసం పది సంవత్సరాల అనుభవం ఉన్నవారు దరకాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పోస్టులకు ఆసక్తి చూపే అభ్యర్థులు ఈనెల 10 వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా మాసబ్ ట్యాంక్ లోని దేశోద్ధారక భవన్ తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయంలో దరకాస్తుఫారాలను పొంది అప్లై చేయాలని, మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సంస్థ నేడు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

# అత్యంత రిచెస్ట్ పార్టీ బీఆర్ఎస్



**ప్రజానావ, హైదరాబాద్:** దేశంలోని ప్రాంతీయ పార్టీల్లో అత్యంత రిచెస్ట్ పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. ఆ పార్టీకి అంత నగదు ఎలా వచ్చిందంటూ ఈ సందర్భంగా ఆయన సందేహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మారలేదని.. కానీ ఆయన రైటర్ మారినట్లుగా ఉందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కారు రేసు కేసులో హైకోర్టు తీర్పు అనంతరం కేటీఆర్ ట్వీట్ చేసిన నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. ఆ క్రమంలో కేటీఆర్‌పై ఆయన వ్యంగ్య బాణాలు సంధించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. సియోల్ బాంబులు పేలడం మొదలవుతున్నాయన్నారు. చేసిన తప్పు ఎప్పటికైనా బయటపడుతుందని ఆయన పేర్కొన్నారు. తప్పు చేసిన వారు.. ఎప్పటికీ తప్పించుకో లేరని స్పష్టం చేశారు. అయితే న్యాయస్థానాలు, వ్యవస్థల ముందు బల ప్రదర్శన చేయడం కరెక్ట్ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. తప్పులు.. ఒప్పులు తేల్చేది కోర్టులని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు టార్గెట్ కాదని స్పష్టం చేశారు. తాము ఎవరినీ టార్గెట్ చేయలేదన్నారు. కేటీఆర్ తప్పు చేయక పోతే కోర్టుకు ఎందుకు వెళ్లారని ఆయన ప్రశ్నించారు. కొత్త సంవత్సరంలో కేటీఆర్‌లో స్పిరిట్ పెరిగిందని చమత్కరించారు. కాంగ్రెస్ పార్టీకి బాండ్స్ ఎందుకు ఇచ్చారో.. అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ చెప్పాలని డిమాండ్ చేశారు. బాండ్స్ మాత్రమే కాదు ఇంకా బయటకు రావాల్సినవి చాలా ఉన్నాయన్నారు. ఇక విదేశీ కంపెనీకి వెళ్లిన నగదు ఎవరి ఖాతాలోకి వెళ్ళాయో తేలాల్సి ఉందన్నారు. కేసీఆర్ ఏ కేసులో ఉన్నా.. మాజీ మంత్రి హరీష్ రావు అక్కడ ఉంటారంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కేసీఆర్ కుటుంబాన్ని కావాలని టార్గెట్ చేసే ఆలోచన లేదన్నారు. అయితే ఏది బయట పడినా.. అందులో ఆ కుటుంబం పాత్ర మాత్రం ఉంటుందన్నారు. ఇక ఇప్పటి వరకు వేసిన కేసులు, విచారణ కమిషన్లు అన్ని బిఆర్ఎస్ పార్టీ వాళ్లు అడిగితేనే వేశామని ఆయన గుర్తు చేశారు. కాళేశ్వరం, విద్యుత్, ఈ ఫార్ములా అంశాలపై సైతం విచారణ జరపాలని వారు కోరారని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. కక్షపూరితంగా, ఉద్దేశపూర్వకంగా చేసిందేమీ లేదన్నారు. వ్యవస్థలో వాళ్లు తప్పులు చేశారని.. కాబట్టే అన్ని బయటపడుతోన్నాయని చెప్పారు. జైలుకు వెళ్తేనే సీఎం అవుతానని కేటీఆర్ అనుకుంటే.. కల్వకుంట్ల కవిత ముందు ఉన్నారని గుర్తు చేశారు. ఇవేది లాభ నష్టాల కోసం జరుగుతున్నవి కావన్నారు. ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ నిజాలు చేప్తే.. అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు. జాతీయ పార్టీలకు లేని నిధులు ప్రాంతీయ పార్టీలకు ఎలా వచ్చాయంటూ ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా.. దేశం గురించి తప్ప తెలంగాణ గురించి మాట్లాడలేదన్నారు. సంక్రాంతి పండుగ అనంతరం రికార్డులను ఫోరెన్సిక్ ఆడిట్ కోసం ప్రైవేట్ సంస్థలకు ఇవ్వబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. భూదాన్, దేవాదాయ, అసైన్డ్ భూముల్లో జరిగిన కుంభకోణాలన్నీ ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా బహిర్గమవుతాయని పేర్కొన్నారు. సిరిసిల్లలో 2 వేల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని తెలిపారు. రంగారెడ్డి, మెదక్, మేడ్చల్ జిల్లాల్లో జరిగిన భూ బాగోతం ఫోరెన్సిక్ ఆడిట్ తర్వాత వెలుగులోకి వస్తుందన్నారు. ఇక భుబారతి బిల్లు గవర్నర్ వద్ద ఉందని వివరించారు. గవర్నర్ నుంచి అనుమతి రాగానే గెజిట్ విడుదల అవుతుందని తెలిపారు. అయితే రూల్స్ ఫ్రేమ్ చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. విద్యుత్ కమిషన్ రిపోర్ట్ వచ్చింది.. ప్రభుత్వం లీగల్ ఒపినియన్ తీసుకుంటున్నదన్నారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ బహిరంగ విచారణ సైతం కొనసాగుతోందన్నారు. అయితే ఫోన్ ట్యాపింగ్ కేసు ఇంకా అవ్వ లేదని స్పష్టం చేశారు. ఈ కేసు ఇంకా కొనసాగుతుందన్నారు. తాను మంత్రి అయిన తర్వాత.. మా జిల్లా మాజీ మంత్రి తాను ఎదురు పడలేదన్నారు. అసలు ఉన్నాడా? లేడా అన్నట్లుగా ఉందన్నారు. ఫార్ములా కార్ల రేసు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ రోజు.. ఈడీ ఎదుట హాజరు కావాల్సి ఉంది. తనకు గడువు ఇవ్వాలని ఈడీని ఆయన కోరారు. దీంతో జనవరి 16వ తేదీన హాజరుకావాలని కేటీఆర్‌ను ఆదేశించారు.

# ప్రజాస్వామ్యంలో దాడులు సరికాదు

**బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండించిన టీపీసీసీ మహేశ్‌కుమార్ గౌడ్**



**ప్రజానావ, హైదరాబాద్:** బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిపైన టీపీసీసీ సీరియస్‌గా స్పందించింది. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన చేపట్టడం అవసరం అయినా, రాజకీయ పార్టీ కార్యాలయంపై దాడికి వెళ్లడం సరైంది కాదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రియాంక గాంధీపై బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, యూత్ కాంగ్రెస్ ఇలాంటి చర్యలకు పాల్పడడం తగదని ఆయన అన్నారు. యూత్ నేతలను పిలిచి వారిని మందలించనున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. బీజేపీ నేతలు కూడా ఇలాంటి దాడులు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. బీజేపీ నేతల తీరును తీవ్రంగా ఖండిస్తున్నా అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య సంస్కృతి కాపాడాలని, శాంతి భద్రతల విషయంలో బీజేపీ నేతలు సహకరించాల్సిన అవసరం ఉందని కూడా మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజాస్వామ్యంలో దాడులు పద్ధతి కాదన్నారు.

# తలచకుంటే గాంధీభవన్ పునాదులు ఉండవు

## ఘాటుగా హెచ్చరించిన బండి, ఏలేటి, ధర్మపురి

**ప్రజానావ, హైదరాబాద్:** బిజెపి కార్యాలయంపై కాంగ్రెస్ దాడిని బీజేపీ తీవ్రంగా ఖండించింది. పార్టీ నేతలు ఈ దాడిని తీవ్రంగా తీసుకున్నారు. తాము తలచుకుంటే గాంధీభవన్ ఉంటుందా అని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ మూకలు దాడి చేయడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..10 మంది కార్యకర్తలొచ్చి దాడులు చేస్తుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ సహా కాంగ్రెస్ కార్యాలయాల పునాదులు కూడా మిగలవని హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అధికార పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడులు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రాళ్ల దాడులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించాలనుకుంటోందా? పిల్లలు, వృద్ధులకు రాళ్ల తగిలితే పరిస్థితి ఏ విధంగా ఉండేదా తెలియదా? అని నిలదీశారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని చేతగానితనంగా భావించొద్దన్నారు. తప్పుడు వ్యాఖ్యలు ఎవరు చేసినా ఖండించాల్సిందే. చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. తక్షణమే దాడికి పాల్పడ్డ కార్యకర్తలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ శాసన సభ పక్షనేత మహేశ్వర్ రెడ్డి స్పందిస్తూ.. బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నానన్నారు. బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ దుండగులను పంపించి దాడులు చేశారని, కార్యకర్తల తలలు పగలగొట్టారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వ ఉందా..? అని ఆయన ప్రశ్నించారు. ఏం చెప్పాలని అనుకుంటున్నారు.. ఏమిటి ఈ సంస్కృతి.. రాష్ట్రానికి హోంమంత్రి లేరు.. సీఎం ఏం చెప్పాలని అనుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ దీనికి బాధ్యత వహించాలని, మహేష్ కుమార్ గౌడ్ వి చిల్లర చేష్టలు అని ఆయన ధ్వజమెత్తారు. దాడికి బాధ్యత వహించి మహేష్ కుమార్ గౌడ్ రాజీనామా చేయాలని, హోం మంత్రి సీఎం చేతుల్లో ఉంది ఆయన రాజీనామా చేస్తారా ? అని ఆయన దుయ్యబట్టారు. దీంతో పాటు.. ఫార్ములా ఈ రేసు కేసు గురించి మాట్లాడుతూ.. కేటీఆర్ అధికారుల ప్రమేయం ఉందని అంటున్నారని, అధికారులను కేటీఆర్ బెదిరించారన్నారు. కేటీఆర్ నిర్దోషి ఐతే నిలబడి ఎదుర్కోవాలని, వాస్తవాలను బయటపెట్టాలన్నారు. గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు జరిగాయన్నారు మహేశ్వర్ రెడ్డి. ఈ పరిస్థితులపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయన మాట్లాడుతూ, 'బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి దురదృష్టకరమైన ఘటన. ఇది కాంగ్రెస్ పార్టీ అసహనాన్ని, బీఆర్ఎస్ తరహా విధానాలను ప్రతిబింబిస్తోంది. మేము కూడా ప్రతిగా ఇలానే ప్రవర్తిస్తే, మీ జాతీయ నాయకులు ఎక్కడికి దాక్కుంటారో' అని ప్రశ్నించారు. అదే సమయంలో, తెలంగాణలో అవినీతి విషయాలపై ఆయన తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 'కేటీఆర్ ఎంతకాలం తప్పించుకుని తిరుగుతారు? చంచల్‌గూడ జైలుకు వెళ్లాలా లేక తీహార్ జైలుకు వెళ్లాలా అనేది కేటీఆర్ నిర్ణయించుకోవాలి. కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడింది. ప్రజల డబ్బును దోచుకుని కోర్టుల్లో పిటిషన్లు వేస్తూ కాలయాపన చేస్తున్నారు. బీజేపీ మాత్రం తెలంగాణలో త్వరలో అధికారంలోకి వస్తుంది,' అని ధర్మపురి భరోసా వ్యక్తం చేశారు. తెలంగాణలో పాలనపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల విధానాలను విమర్శిస్తూ, బీజేపీ తన రాజకీయ పోరాటాన్ని ఉధృతం చేస్తుందని స్పష్టంగా పేర్కొన్నారు.

# యూత్ కాంగ్రెస్ దాడి దుర్మార్గం

**తీరుమార్చుకోకుంటే పరిస్థితులు తీవ్రం ■ హెచ్చరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



**ప్రజానావ, హైదరాబాద్:** భాజపా రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తల దాడిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దుర్మార్గ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్ పార్టీ.. తీరు మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. పోలీసులను వెంట తీసుకొచ్చి భాజపా కార్యాలయంపై రాళ్లు విసిరారని, పోలీసులు ఇలా వ్యవహరించడం ఎంత వరకు సమంజమని హైదరాబాద్ సీపీని ప్రశ్నించారు. భాజపా తలచుకుంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రోడ్లమీద తిరగలేరని హెచ్చరించారు. రోజు రోజుకూ కనుమరుగవుతున్న కాంగ్రెస్ పార్టీ.. నిరాశతో భౌతిక దాడులకు దిగడాన్ని ప్రజలు క్షమించరన్నారు. ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలు, భౌతిక దాడులకు తావు లేదన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎక్కడ ఉందని భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. దాడిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఆశారాం బాపుకు మధ్యంతర బెయిల్ మంజూరు

**న్యూఢిల్లీ:** ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపుకు సుప్రీంకోర్టు మంగళవారం మధ్యంతర బెయిల్ మంజూరీ చేసింది. ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో మార్చి 31వ తేదీ వరకు ఆయనకు బెయిల్ ఇచ్చారు. మెడికల్ గ్రౌండ్స్ మీద 86 ఏళ్ల ఆశారాం బాపుకు బెయిల్ ఇస్తున్నట్లు కోర్టు తెలిపింది. జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను పాస్ చేసింది. ఆశారాం బాపు తరపున సీనియర్ న్యాయవాది దేవదత్త కమత్ వాదించారు. ఆయనతో పాటు అడ్వకేట్లు రాజేశ్ గులాబ్ ఇనాందార్, శాశ్వత్ ఆనంద్ కూడా ఉన్నారు. ఆశారాం బాపు అసలు పేరు అసుమల్ సిరుమలాని హర్పలని. జోద్‌పూర్‌లోని అతన ఆశ్రమంలో ఓ టీనేజ్ అమ్మాయిని రేప్ చేసిన ఘటనలో అతన్ని అరెస్టు చేశారు. జోద్‌పూర్ కేసులో బెయిల్ దొరికినా.. మరో రేప్ కేసులో అతని పేరు ఉన్న కారణంగా ఇప్పుడే అతను జైలు విడిచి బయటకు రాలేరు. 2013లో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఓ మహిళను కూడా లైంగికంగా వేధించినట్లు ఆశారాంపై ఆరోపణలు ఉన్నాయి.

# నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో భూకంపం



**న్యూఢిల్లీ :** నేపాల్ సరిహద్దుల్లో టిబెట్ సమీపంలో మంగళవారం ఉదయం భూకంపం సంభవించిన ఘటనలో 95 మంది మరణించారు. అంతకంతకూ మృతుల సంఖ్యల పెరుగుతోంది. అలాగే భారత్‌లోని పలు ప్రాంతాలు.. బిహార్, అసోం, పశ్చిమ బెంగాల్‌లో సైతం భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఈ మేరకు చైనా మీడియా సంస్థ వెల్లడించింది. టిబెట్ రాజధాని లాసాకు దాదాపు 400 కిలోమీటర్ల దూరంలోని షిగాట్సే నగరంలోని టింగ్రి కౌంటీ వద్ద భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వివరించింది. మంగళవారం ఉదయం ఈ ప్రాంతంలో వరుసగా పలుమార్లు భూకంపం సంభవించిందని తెలిపింది.

తొలుత ఉదయం 6.35కు.. ఆ తర్వాత 7.02 గంటలకు 10 కిలోమీటర్లు లోతుగా 4.7 తీవ్రతతో భూకంపం సంభవించిందని పేర్కొంది. ఆ కొద్ది సెకన్లకే అంటే.. 7.07 గంటలకు 30 కిలోమీటర్ల లోతులో మళ్లీ భూమి మరింతగా కంపించిందని.. ఇది 4.9 తీవ్రతతో వచ్చిందని చైనా మీడియా చెప్పింది. హిమాలయ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తోంటాయని గుర్తు చేసింది. అయితే 2015లో నేపాల్‌లో 7.8 తీవ్రతతో భూకంపం ఏర్పడిందని గుర్తు చేసింది. ఈ ఘటనలో దాదాపు 9 వేల మంది మరణించారని వివరించింది. అలాగే 22 వేల మంది గాయపడ్డారని చెప్పింది. అయితే ఈ భూకంప తీవ్రతకు లక్షలాది ఇళ్లు నేలమట్టం అయ్యాయని గుర్తు చేసింది.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
బుధవారం
8 జనవరి 2025


# కేటీఆర్‌కు హైకోర్టు షాక్

- ఏసీబీ కేసులో క్వాష్ పిటిషన్ కొట్టివేత
- విచారణకు ఏసీబీకి అనుమతించిన హైకోర్టు



**ప్రజానావ, హైదరాబాద్:** భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 31న ఇరువైపుల వాదనలు ముగించిన హైకోర్టు.. మంగళవారం తీర్పు వెలువరించింది. కేటీఆర్‌ను అరెస్ట్ చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఉపసంహరించింది. ఏసీబీ అరెస్ట్ చేయకుండా 10 రోజుల పాటు మధ్యంతర ఉత్తర్వులు పొడిగించాలన్న కేటీఆర్ విజ్ఞప్తిని తిరస్కరించింది. ఉన్నత న్యాయస్థానం తీర్పుపై కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చిస్తున్నారు. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానంలో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనను కూడా వినాలని ముందస్తుగానే పిటిషన్ వేసింది. ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఫార్ములా - ఈ రేసు వ్యవహారంలో ఒప్పందం జరగకముందే చెల్లింపులు చేశారని ఆయన కోర్టుకు తెలిపారు. బ్రిటన్ పౌండ్ల రూపంలో రూ.46 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఈ - కార్ల రేసింగ్ సీజన్ 10 ఒప్పందానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేశారన్నారు. దర్యాప్తు ఏ దశలో ఉందని ఈ సందర్భంగా ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. కేసు విచారణ ప్రాథమిక దశలోనే ఉందని.. అన్ని ఆధారాలు బయటపడతాయని ఏజీ తెలిపారు. ఇప్పటికే ఫిర్యాదుదారు దానకిశోర్ వాంగ్మూలం సేకరించినట్లు కోర్టుకు తెలిపారు. నిందితులు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా అని న్యాయస్థానం ప్రశ్నించారు. ఇప్పటివరకు నిందితులు ఎలాంటి పిటిషన్లు దాఖలు చేయలేదని, ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని ఏజీ తెలిపారు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ధర్మాసనానికి ఏజీ తెలిపారు. దానకిశోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీపీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పురపాలక శాఖ మంత్రి పర్యవేక్షణలోనే ఆ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపుల దస్త్రాన్ని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదించారని కోర్టుకు తెలిపారు. రేసింగ్ వ్యవహారంలో అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్లు కేటీఆర్‌కు వర్తించవని కోర్టుకు తెలిపారు. నగదు బదిలీలో కేటీఆర్ ఎక్కడా లబ్ధిపొందలేదని, అవినీతి జరిగినట్లు కూడా ఎఫ్ఐఆర్‌లో ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు. ఫార్ములా-ఈ కార్ల రేసు నిర్వహణపై జరిగిన ఒప్పందంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, ఫార్ములా -ఈ ఆపరేషన్స్ సంస్థ సంతకాలు చేశాయని ఆయన వాదించారు. పురపాలక శాఖకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన కేటీఆర్‌ను ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా చేర్చడం తగదన్నారు. ఈ మేరకు పలు హైకోర్టు తీర్పులను సిద్దార్థ్ దవే ప్రస్తావిస్తూ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరారు. ఈ కేసులో ఏసిబి వాదనలు పరిగణలోకి తీసుకున్న హైకోర్టు కొద్దిసేపటిక్రితమే కెటిఆర్ క్వాష్ పిటిషన్ ను కొట్టివేస్తూ తీర్పు వెల్లడించింది. కాగా, సోమవారం ఏసిబి విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. కెటిఆర్ డుమ్మా కొట్టిన సంగతి తెలిసిందే. తన లాయర్ ను ఏసిబి కార్యాలయంలోకి అనుమతించకపోవడంతో ఆయన విచారణకు హాజరవ్వకుండానే తిరిగి వెళ్లిపోయారు. దీంతో విచారణకు హాజరవ్వాలని మరోసారి ఎసిబి అధికారులు కెటిఆర్ కు నోటీసులు ఇచ్చింది.మ-రోవైపు, ఇదే కేసులో ఇవాళ ఈడీ విచారణ పిలవగా.. తనకు సమయం కావాలని కెటిఆర్ కోరారు. దీంతో ఆయనకు కొంత సమయం ఇస్తున్నట్లు తెలిపింది.

## కిమ్స్‌లో శ్రీతేజకు
# పుష్ప పరామర్శ
### నిర్మాత దిల్‌రాజ్‌తో కలసి ఆస్పత్రికి రాక



**ప్రజానావ, సోమాజిగూడ:** సినీ నటుడు అల్లు అర్జున్ సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించారు. తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజుతో కలిసి లోపలికి వెళ్లారు. సుమారు 20 నిమిషాల పాటు ఆస్పత్రిలో ఉన్న అల్లు అర్జున్.. వైద్యులతో మాట్లాడి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలుడి తండ్రి భాస్కర్‌తోనూ మాట్లాడారు. మరోవైపు ఆస్పత్రి వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదైన నేపథ్యంలో పరామర్శకు వెళ్లొద్దని లీగల్ టీమ్ చెప్పడంతో శ్రీతేజ్ వద్దకు రాలేదని ఇటీవల అల్లు అర్జున్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తెలిపారు. తాజాగా పోలీసులకు సమాచారం ఇచ్చిన తర్వాత కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి శ్రీతేజ్‌ను పరామర్శించారు. గత నెల 4న 'పుష్ప2' బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి చనిపోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం ఆ బాలుడిని కిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే రేవతి కుటుంబానికి అల్లు అర్జున్‌తో పాటు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, దర్శకుడు సుకుమార్ ఆర్థికసాయం ప్రకటించారు. అల్లు అర్జున్ రూ.కోటి, పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50లక్షల చెక్కులను ఇటీవల దిల్ రాజు ద్వారా ఆ కుటుంబానికి అందజేశారు.

## ఫార్ములా ఈ కార్ రేసు కేసు
# కీలక మలుపు

**ప్రజానావ, హైదరాబాద్:** ఫార్ములా ఈ కార్ రేసు కేసు కీలక మలుపు తిరిగింది. సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం కెవియేట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ కేసులో ఒకవేళ కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనను కూడా వినాలని సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు గానే ఆశ్రయించింది. ఫార్ములా?ఈ కార్ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. అరెస్ట్ చేయొద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులును కూడా హైకోర్టు ఎత్తివేసింది. ఏసీబీ దర్యాప్తులో తాము జోక్యం చేసుకోలేమని కేటీఆర్ తరపు న్యాయవాదికి హైకోర్టు స్పష్టం చేసింది. చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించింది. అందరికి 'రూల్ ఆఫ్ లా' వర్తిస్తుందని కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేసిన సందర్భంగా తెలంగాణ హైకోర్టు గుర్తుచేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ కోసం రూ.55 కోట్లు విదేశీ కంపెనీలకు చెల్లించారు. అయితే అప్పట్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ నిధులను విదేశీ సంస్థలకు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు లేఖ రాసింది. ఏసీబీకి కూడా మున్సిపల్ శాఖ ఫిర్యాదు చేసింది. ఏసీబీ రంగంలోకి దిగి విచారణ జరిపింది. ఫార్ములా ఈ రేస్ కోసం జరిగిన బ్యాంక్ లావాదేవీలపై ఏసీబీ ఆరా తీసింది. హెచ్ఎండీఏ నుంచి ట్రాన్స్‌ఫర్ అయిన నిధులు.. ఏ అకౌంట్స్?లోకి చేరాయనేది కూడా గుర్తించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలోనే డబ్బులు ట్రాన్స్?ఫర్ అయినట్లు తేల్చింది. ఈసీ నుంచి అనుమతులు తీసుకోకుండా నిబంధనలు అతిక్రమించారని తేలింది. 2023 అక్టోబర్ 3, 11వ తేదీల్లో హెచ్ఎండీఏ బోర్డు అకౌంట్ నుంచి రూ.45.71 కోట్లు లండన్‌లోని ఫార్ములా?ఈ ఆపరేషన్స్‌కు తరలించారు. ఇందుకు గాను ఆర్బీఐ రూల్స్ పాటించనందున హెచ్ఎండీఏ రూ.8 కోట్లను ఐటీ శాఖకు పెనాల్టీగా చెల్లించాల్సి వచ్చింది. ఫెడరేషన్ ఆఫ్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఐఏ)కు రూ.1.10 కోట్లు చెల్లించారు. ఇలా మొత్తం రూ.54.89 కోట్లు మున్సిపల్ నిధులను అప్పటి మంత్రి కేటీఆర్ దుర్వినియోగం చేశారని ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

# కేటీఆర్‌కు మరోమారు నోటసులు
### 16న విచారణకు రావాలని ఈడీ ఆదేశం

**ప్రజానావ, హైదరాబాద్:** ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరోసారి నోటీసులు ఇచ్చింది. ఈ నెల 16న విచారణకు రావాలని కేటీఆర్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. వాస్తవానికి ఈడీ ఎదుట కేటీఆర్ మంగళవారమే హాజరు కావాల్సి ఉంది. అయితే, ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ రద్దు చేయాలని ఇప్పటికే హైకోర్టులో వేసిన కేసులో తీర్పు రిజర్వ్‌లో ఉందని తెలిపారు. హైకోర్టుపైనున్న గౌరవంతో.. తీర్పును వెలువరించేంత వరకు ఈ అంశంలో తనకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఈడీకి కేటీఆర్ సమాధానం పంపారు. అయితే ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ క్రమంలో ఈడీ తాజాగా మళ్లీ నోటీసులు జారీ చేసి 16న విచారణకు రావాలని కేటీఆర్‌ను ఆదేశించింది. హైకోర్టు తీర్పుపై కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. దీనిపై నందినగర్‌లోని తన నివాసంలో తన లీగల్ టీమ్‌లో చర్చిస్తున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులతో సమాలోచనలు చేస్తున్నారు. కాగా, క్వాష్ పిటన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందీనగర్‌లోని కేటీఆర్ నివాసానికి పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు.

# బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన
### ఏం జరుగుతుందనే ఆరా

**ప్రజానావ, హైదరాబాద్:** హైకోర్టు కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేయడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. కేటీఆర్ అరెస్ట్‌పై స్టేను సైతం ఎత్తివేయడంతో టెన్షన్ పెరిగింది. దీంతో నంది నగర్ నివాసంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో కేటీఆర్ భేటీ అయ్యారు. మాజీ మంత్రి లీగల్ టీమ్స్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. హై కోర్టు ఫుల్ బెంచ్‌కు వెళ్లాలా సుప్రీంకోర్టుకు వెళ్లాలా అనే దానిపై సమాలోచనలు చేస్తున్నారు. ఇప్పుడు ఏసీబీ ఏ నిర్ణయం తీసుకుంటుందనే దానిపై బీఆర్ఎస్‌లో ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ అరెస్ట్ చేస్తే ఇప్పటికిప్పుడు ఏమి చేయాలి అనే అంశంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఫార్ములా ఈ-రేసు కేసును అటు ఏసీబీ, ఇటు ఈడీ విచారిస్తున్నాయి. విచారణకు హాజరు కావాలని ఈడీ మాజీ మంత్రికి తెలిపింది. జనవరి 7న తమ ఎదుట హాజరుకావాలని ఈడీ ఇప్పటికే కేటీఆర్‌కు నోటీసు ఇచ్చింది. మంగళవారం తీర్పు వెలువరించనున్న నేపథ్యంలో తనకు సమయం ఇవ్వాలని ఈడీని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈడీకి కేటీఆర్ మెయిల్ పంపారు. హైకోర్టుపై ఉన్న గౌరవంతో.. తీర్పు వచ్చేంత వరకు సమయం ఇవ్వాలని విన్నవించారు. అయితే కేటీఆర్ విజ్ఞప్తిపై ఈడీ అధికారులు స్పందించారు. విచారణకు మరో తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు. తీర్పు వెలువడిన నేపథ్యంలో ఈడీ తదుపరి చర్యలపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి సోమవారం నోటీసులిచ్చారు. ఈ నెల 9న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.



# సుప్రీంకు కేటీఆర్
### నేడో, రేపో విచారణకు వచ్చే అవకాశం

**ప్రజానావ, హైదరాబాద్:** ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మాజీ మంత్రి కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు మంగళవారం కొట్టివేయడంతో ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లారు. బీఆర్ఎస్ న్యాయవాదుల బృందం కేసును సుప్రీంకోర్టులో ౹÷ల్ చేసింది. బుధవారం లేదా గురువారం కేసు విచారణకు వచ్చే అవకాశం ఉందని కేటీఆర్ తరపు న్యాయవాదులు చెబుతున్నారు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే దీనిపై విచారణ చేసిన కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది, ఇవాళ తాజాగా ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను రద్దు చేస్తూ తీర్పు చెప్పింది. అంతేకాకుండా అంతకుముందు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దంటూ రెండుసార్లు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సైతం న్యాయస్థానం ఎత్తివేసింది. దీంతో కేటీఆర్‌ను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టును కేటీఆర్ ఆశ్రయిచారు. మరోవైపు సుప్రీంకోర్టును కేటీఆర్ ఆశ్రయ-ిస్తారని ముందుగానే పసిగట్టిన తెలంగాణ ప్రభుత్వం ఆయన కంటే ముందే ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేసింది. తమ వాదనలు వినకుండా కేటీఆర్ పిటీషన్‌పై ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దంటూ సర్కార్ కేవియట్ దాఖలు చేసింది. దీంతో సుప్రీంకోర్టును కేటీఆర్ ఆశ్రయించినప్పటికీ వెంటనే మధ్యంతర ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలు తక్కువగా ఉండనున్నాయి. తెలంగాణ ప్రభుత్వ వాదనలు విన్న తర్వాతే సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది.

## కాంగ్రెస్ ప్రభుత్వం
# డైవర్షన్ రాజకీయాలు

- బ్లాక్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు భయపడేది లేదు
- ప్రభుత్వం తప్పలను ఎత్తి చూపుతూనే ఉంటాం
- హైదరాబాద్ బ్రాండ్ కోసం కెటిఆర్ కష్టపడ్డారు
- ఈ- ఫార్ములాలో విచారణ చేయమని మాత్రమే హైకోర్టు ఆదేశం
- మీడియా సమావేశంలో హరీష్ రావు వివరణ



**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఇలాంటి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తాము భయపడేది లేదన్నారు. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలతోని, అక్రమ కేసులతో, అరె-స్టులతో తన ప్రభుత్వం తన తప్పిదాలను కప్పిపుచ్చుకోని.. తమను మానసికంగా బలహీన పరు-స్తున్నానని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడు. కానీ కాని తాము మరింత బలంగా పోరాడుతాము తప్ప, మీ అక్రమాలపై, ఆరు గ్యారంటీల అమలుపై ప్రశ్నించడం మాత్రం ఆపేది లేదని చెప్పారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో నందినగర్‌లోని కేటీఆర్ నివాసం వద్ద పార్టీ నేతలతో కలిసి హరీశ రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా కేటీఆర్‌పై అక్రమ కేసు నమోదుచేసిందని రాష్ట్ర ప్రజలకు తెలుసున్నారు. రైతుబంధు విషయంలో వానాకాలం రైతు బంధు ఎగ్గొట్టి, యాసంగి పంటకు కూడా రూ.15 వేలు కాకుండా రూ.6 వేలు మాత్రమే ఇస్తామని చెప్పి రేవంత్ ప్రభుత్వం ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నదని చెప్పారు. ఏడాది పాలన తర్వాత అన్ని సర్వే రిపోర్టుల్లో ప్రభుత్వం ఫెయిల్ అయిందని, రేవంత్ ఫెయిల్యూర్ సీఎం అని తేలింది. దీంతో కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి, ప్రజల దృష్టిని మరల్చాలని రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారు. రేవంత్ రెడ్డి అరెస్టయి జైల్లో పడడానికి ఈ కేసుకి పొంతనలేదు. రేవంత్ రెడ్డి డబ్బుల కట్టలతో కెమెరాల ముందు దొరికి జైలుకు పోయాడు. కేటీఆర్ మాత్రం తెలంగాణ కోసం, హైదరాబాద్ బ్రాండ్ ఈమేజి కోసం ఫార్ములా ఈ రేస్ తీసుకువచ్చాడు. రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం కేటీఆర్ అక్రమ కేసుకి పోల్చడం అంటే మోకాలికి.. బోడి గుండుకి ముడి వేయడమే. ఎన్ని రకాల కేసులు పెట్టిన మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడంపై వెనక్కి వెళ్లం. ఎన్ని కేసులు పెట్టినా నువ్వు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసేదాకా నీ వెంట పడతాం. అక్రమ కేసులతోనూ, అరెస్టులతోనూ మమ్మల్ని బలహీనపరచాలన్న రేవంత్ రెడ్డి కుట్ర చెల్లదు. ఎన్ని రకాల కేసులు పెట్టినా రేవంత్ రెడ్డిని వదిలిపెట్టం అని హెచ్చరించారు. హైకోర్టులో ఇచ్చిన తీర్పు కేసులో అవినీతి జరిగిందని నిర్ధారించలేదు. కేసులో అవినీతి ఉందని శిక్ష వేసిన తీర్పు కాదు. ప్రభుత్వం అవినీతి జరిగింది అని చెప్పినప్పుడు.. విచారణ చేసుకోమని కోర్టు చెప్పింది. గతంలో కూడా కేటీఆర్ విచారణకు సిద్ధమని చెప్పారు. ఈ అంశంలో సుప్రీంకోర్టుకు వెళ్లాలా అనే అంశంపై మా లీగల్ సెల్ నిర్ణయిస్తుంది. హైకోర్టు తీర్పు కాపీని పూర్తిగా చదివిన తర్వాత లీగల్ సెల్ సలహా మేరకు తదుపరి కార్యాచరణ చేపడతాం. నిన్న ఏసీబీ దగ్గరికి కూడా విచారణ ఎదుర్కోవడానికి కేటీఆర్ వెళ్లారు. 9వ తేదీన కూడా ఇచ్చిన నోటీసు మేరకు విచారణకు వెళ్తారు. నిన్న కూడా 45 నిమిషాలు ఆపినా కేటీఆర్ ఓపిగ్గా వేచి చూశారు. కచ్చితంగా విచారణను ఎదుర్కొంటాం అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచడం కోసమే కేటీఆర్ ఫార్ములా-ఈ ని హైదరాబాద్‌కి తెచ్చారు. ఇదే రేసును తమ రాష్ట్రాలకు నగరాలకు తీసుకురావడానికి అనేక రాష్ట్రాలు పోటీపడ్డాయి ఒక్క రూపాయి కూడా చేతులు మారినప్పుడు అవినీతి ఎట్లా జరుగుతుంది. రేవంత్ రెడ్డి తప్పిదాలను, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను అడుగడుగునా ప్రశ్నించినందుకే కేటీఆర్‌పై ఈ కేసు పెట్టారు. అటెన్షన్ డైవర్షన్ కోసమే రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారు. రైతుబంధు ఎగగొట్టడం వల్ల ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొంటున్నది. అన్ని సర్వే రిపోర్టులు రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా వస్తున్నాయి. అందుకే మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టి అటెన్షన్ డైవర్షన్ కోసం రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారు. భవిష్యత్తులోనూ తమలాంటి నాయకులపై కేసులు పెడతారని మాకు తెలుసు. ఎన్నో పోరాటాలతోనే త్యాగాలతోని తెలంగాణ తెచ్చుకున్నాం. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్‌కు ముఖ్యం. రేవంత్ రెడ్‌ని కూడా ఫార్ములా-ఈ కంపెనీ ప్రతినిధి కలిసినా ఇప్పటిదాకా బయట పెట్టలేదు. రైతు భరోసాను తగ్గించి ప్రజలకు ఇస్తున్నందుకు.. వారి నుంచి వచ్చే వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికే ప్రభుత్వం ఈ కేసు పెట్టింది. ఇది కేవలం కక్ష సాధింపు చర్య మాత్రమే. ఎన్ని రకాల కేసులు పెట్టినా, ఎన్ని కక్ష సాధింపు చర్యలకు పాల్పడినా తెలంగాణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాం. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా మేమెప్పుడూ తెలంగాణ ప్రజల పక్షమే. కేటీఆర్‌పై పెట్టిన కేసులు కానీ, పార్టీ నేతలపై పెడుతున్న కేసులను కానీ పార్టీ ఎదుర్కొంటుంది. కేటీఆర్ కడిగిన ముత్యంల బయటకి వస్తారు. ఎలాంటి తప్పు చేయలేదన్న ధైర్యం ఉంది కాబట్టి విచారణకి వెళ్తాం. మాకు అధికారులపై, కోర్టులపై విశ్వాసం ఉంది. కానీ రేవంత్ రెడ్డి పైన లేదు. కోర్టులో వచ్చిన తీర్పు పైన కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ విచారణ మాత్రమే చేయమని హైకోర్టు చెప్పింది. విచారణ ప్రారంభం కాకముందే తప్పు జరిగిందని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారు. కొంతమంది హైకోర్టు తీర్పును తప్పుడుగా వక్రీకరిస్తున్నరు. కేటీఆర్‌పై పెట్టిన కేసు తుఫేల్ కేసు. కోర్టుల్లో నిలబడదు. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే చేస్కోనివ్వండి. కోర్టులోనే తేల్చుకుంటాం. అక్రమ అరెస్టులకు మేము భయపడే వాళ్లం కాదు. సమైక్య రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల పైన చిచ్చరపిడుగుల్లా పోరాడిన చరిత్ర మాది. గతంలో అరెస్టయి కేటీఆర్ వరంగల్ జైల్లో ఉన్నారు. గ్రీన్‌కోకి రూపాయి లబ్ది చేయనప్పుడు వారు ఎందుకు మాకు తిరిగి డబ్బులు ఇస్తారు. అదే గ్రీన్‌కో కంపెనీ ఫార్ములా-ఈ రేసు నిర్వహణలో భారీగా నష్టపోయింది ఇలాంటి పరిస్థితుల్లో వారి నుంచి డబ్బులు వచ్చాయనడం అర్థరహితం' అని హరీశ్ రావు అన్నారు. న్యాయస్థానాలపై మాకు గౌరవం ఉంది. విచారణకు సహకరిస్తాం. ఇప్పటికే విచారణ కోసం కేటీఆర్ ఏసీబీ కార్యాలయానికి కూడా వెళ్లారు. ఈ నెల 9న విచారణకు హాజరవుతారు. కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి ప్రజల దృష్టి మరల్చారని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. రైతు భరోసాను రూ.15వేల నుంచి రూ.12వేలకు తగ్గించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే ఆయనపై కేసులు పెడుతున్నారు. ఇంకా చాలా మంది నేతలపై రేవంత్ రెడ్డి కేసులు పెడుతారు. ఇలాంటి బ్లాక్ మెయిల్ రాజకీయాలు, అక్రమ కేసులకు భయపడేది లేదు. అరెస్టులు మాకు కొత్త కాదు. దీనిపై న్యాయవాదుల సలహా మేరకు తదుపరి కార్యాచరణ చేపడుతాం. హైకోర్టు తీర్పు కాపీ పూర్తిగా పరిశీలించాక నిర్ణయం తీసుకుంటాం. ఈ కేసులో కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటికొస్తారు' అని హరీశ్ రావు వెల్లడించారు. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో రూపాయి అవినీతి కూడా జరగలేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. ఈ కేసులో న్యాయపరంగా పోరాడతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటం చేయాలని కేటీఆర్ ఆదేశించినట్లు పేర్కొన్నారు.

# విశ్వవేదికపై తెలంగాణ క్రీడారంగం

- సోర్ట్స్ వర్సిటీతో అభివృద్ధికి యత్నం
- ప్రపంచ దేశాల్లో నైపుణ్యాల పరిశీలన
- సింగపూర్ పర్యటనలో అధ్యయనం చేయనున్న రేవంత్



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం క్రీడా రంగంలో కీలకమైన అడుగులు వేయబోతోంది. క్రీడా వర్సిటీ కోసం చేస్తున్న యత్నాలు ఫలిస్తే తెలంగాణ క్రీడారంగంలో దూసుకుపోవడం ఖాయం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తూ, దేశంలోని అత్యంత ఆధునిక స్థాయిలో లక్ష మంది కూర్చునే సామర్థ్యం కలిగిన భారీ స్టేడియాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ఫ్యూచర్‌సిటీలో లేదా మరో ప్రాంతంలో 100 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ స్టేడియంలో అత్యాధునిక సాంకేతికతతో క్రికెట్, ఫుట్‌బాల్ వంటి వివిధ క్రీడలకు అనువైన మైదానాలను రూపొందిస్తారు. రాష్ట్రంలోని క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ, మౌలిక సదుపాయాలు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణను క్రీడల కేంద్రంగా మార్చాలన్నది సీఎం రేవంత్ రెడ్డి దృష్టిగా ఉంది. దీనికి సంబంధించిన ప్లానింగ్ వంటి అంశాలపై అధ్యయనం చేస్తారు. 18న సింగపూర్ లో పర్యటించనున్న సీఎం, అక్కడి మల్టీ-యూజ్ స్పోర్ట్స్ ఫెసిలిటీస్, ట్రాఫిక్ నిర్వహణ పద్ధతులు, క్రీడా మైదానాల నిర్వహణపై అవగాహన పెంచుకుంటారు. సింగపూర్‌లో చిన్న దేశంగా ఉన్నప్పటికీ, ఒలింపిక్స్ మెడల్స్ సాధించడంలో తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను పరిశీలిస్తారు. ప్రస్తుతం గుజరాత్‌లోని మోతేరా స్టేడియం దేశంలోనే అతిపెద్దది, 1.32 లక్షల మంది సామర్థ్యంతో ఉంది. తెలంగాణలో నిర్మించబోయే ఈ కొత్త స్టేడియం గుజరాత్ స్థాయికి తగ్గదిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మైదానం అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్లు, ఐపీఎల్ మ్యాచ్‌లకు కేంద్రంగా మారుతుందని అంచనా. క్రీడాభివృద్ధిపై మరింత అవగాహన పొందేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 15, 16 తేదీల్లో ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతున్నారు. అక్కడి క్రీడా మైదానాలు, శిక్షణా విధానాలు, ప్లానింగ్ వంటి అంశాలపై అధ్యయనం చేస్తారు. 18న సింగపూర్ లో పర్యటించనున్న సీఎం, అక్కడి మల్టీ-యూజ్ స్పోర్ట్స్ ఫెసిలిటీస్, ట్రాఫిక్ నిర్వహణ పద్ధతులు, క్రీడా మైదానాల నిర్వహణపై అవగాహన పెందించుకుంటారు. సింగపూర్‌లో చిన్న దేశంగా ఉన్నప్పటికీ, ఒలింపిక్స్ మెడల్స్ సాధించడంలో తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను పరిశీలిస్తారు. తెలంగాణలో ఇప్పటికే 760 ఎకరాల్లో స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేశారు. దీనికి తోడు ఇప్పుడు ఈ భారీ ప్రాజెక్ట్ రాష్ట్ర క్రీడా రంగానికి దిశానిర్దేశం చేయనుంది. క్రీడలకు సంబంధించిన ప్రణాళికలు, క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ, సమగ్ర విధానం అమలులోకి తెచ్చే యోచనలో ఉంది. 20-24 తేదీల్లో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం పాల్గొంటారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులపై కూడా చర్చించనున్నారు. తెలంగాణ క్రీడా రంగానికి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ అయిన ఈ స్టేడియం, రాష్ట్రాన్ని క్రీడా భవిష్యత్తు కేంద్రంగా మార్చేందుకు సహాయపడుతుదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.



# చైనా జలఖడ్గంపై దృష్టి పెట్టాల్సిందే!

చైనా ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తూనే ఉంటుంది. పొరుగు దేశాలను గుప్పిట్లో ఉంచుకోవడం, ఎదుగుతున్న దేశాలకు ఎసరు పెట్టడం దాని లక్ష్యంగా ఉంది. కరోనాతో ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన చైనా తన మనుగడ, పెత్తనం కోసం ఎంతకైనా తెగిస్తుందని రుజువు చేసింది. తాజాగా హెచ్‌ఎంపివి వైరస్ కూడా ఇలాంటిదే. కరోనా సమయంలోనూ తమకు సంబంధం లేదని బుకాయించింది. అలాగే ఇప్పుడీ కొత్త వైరస్‌పైనా ప్రపంచాన్ని బుకాయిస్తోంది. ఎలాంటి ప్రాణాంతకం కాదని చెబుతోంది. చైనా తన మార్కెట్ పరిధిని పెంచుకునే ప్రయత్నంలో ఎలాంటి దురాగతాలకైనా పాల్పడుతుందనడానికి ఇవి నిదర్శనాలు. ఇకపోతే ఇప్పుడు చైనాతో అతిపెద్ద ముప్పు ఏర్పడబోతోంది. భారత్, నేపాల్‌లతో చైనా తన సరిహద్దుల ముక్కోణపు కూడలికి బాగా దగ్గరగా యార్లుంగ్ జాంగ్బో నదిపైన, గంగా ఉపనదిపైన టిబెట్‌లో కొత్త డ్యామ్‌ను నిర్మిస్తున్నదని వార్తలు వచ్చాయి. ఈ వార్త కొన్ని సంవత్సరాలుగా వివిధ వార్తా పత్రికల్లో ప్రచురితమైంది. నిజానికి ఈ డ్యామ్ నిర్మాణం జరిగితే భారత్ భద్రతకు తీవ్ర ముప్పు ఉందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో అలాంటిదేమీ లేదని తాజాగ ఆచైనా ప్రకటించింది. దీంతో భారత్‌కు ఎలాంటి ఉపద్రవం రాదని న మ్మబలికింది. చైనా ప్రభుత్వం బ్రహ్మపుత్రకు టిబెట్ పేరు అయిన యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతాల్లో ఒక జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆమోదించింది. జల విద్యుత్ ప్రాజెక్టు యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతంలో ఉంటుంది. హిమాలయ ప్రాంతంలో ప్రధాన ఇరుకైన లోయలో డ్యామ్ నిర్మాణం జరుగుతుంది. అక్కడ నది నాటకీయంగా మలుపు తీసుకుని అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవహించి, చివరగా బంగ్లాదేశ్‌కు చేరుకుంటుంది. ఆ డ్యామ్ చైనాకు నదీ ప్రవాహంపై నియంత్రణాధికారం కల్పిస్తుందని, ప్రాజెక్టు స్థాయి కారణంగా సరిహద్దు ప్రాంతాలను వరదల్లో ముంచెత్తేందుకు అవకాశం ఇస్తూ, సంక్షోభ సమయాల్లో అధిక మొత్తంలో నీటి విడుదలకు వీలు కల్పిస్తుందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. కానీ, బ్రహ్మపుత్ర నదిపై చైనా భాగంలో డ్యామ్ నిర్మాణాన్ని ఆమోదించాలన్న తన నిర్ణయాన్ని చైనా సమర్థించుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్‌ను టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై నిర్మించాలన్న చైనా యోచనపై భయాందోళనలు అనవసరమని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ డిసెంబర్ 27న అన్నారు.మెగా ప్రాజెక్టు దిగువ నదీ పరివాహక దేశాలను ప్రభావితం చేయదని, దశాబ్దాల తరబడి అధ్యయనాల ద్వారా వాటి భద్రత ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని సరి చేయడమైందని మావో నింగ్ స్పష్టం చేశారు, 137 బిలియన్ డాలర్ల ప్రాజెక్టును టెక్టోనిక్ ప్లేట్ సరిహద్దు పొడుగునా పర్యావరణపరంగా సున్నితమైన హిమాలయ ప్రాంతంలో నిర్మిస్తున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద డ్యామ్ ప్రభావం పల్లపు ప్రాంతాలపై పడదని ఆమె చెప్పారు. ఆ డ్యామ్‌ను ఉపగ్రహ చిత్రాల ఆధారంగా దిగువ ప్రాంతాలకు నీటి ప్రవాహం నియంత్రణ కు చైనా ఉపయోగించుకోవచ్చు. చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్‌హువా వార్తా సంస్థ ఉటంకించిన అధికార ప్రకటన ప్రకారం, తుదకు 2024 డిసెంబర్ 25న అన్ని సందేహాలను పరిహరిస్తూ వెలువరించింది. ఇప్పుడు భారత్ అభ్యంతరం చెప్పడంతో అంతగా భయపడాల్సిన అవసరం లేదని అంటోంది. సీమాంతర నదుల అభివృద్ధి పట్ల చైనా ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా ఉంటున్నట్లు, టిబెట్‌లో జలవిద్యుత్ అభివృద్ధిపై దశాబ్దాల పాటు అధ్యయనం చేసినట్లు, ప్రాజెక్టు భద్రతకు, పర్యావరణ, వాతావరణ పరిరక్షణకు సముచిత చర్యలు తీసుకున్నట్లు మావో నింగ్ చెబుతున్నా నమ్మశక్యంగా లేవు. భారత సరిహద్దుకు సమీపంగా టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై 137 బిలియన్ యుఎస్ డాలర్లు విలువ చేసే భూగ్రహంపై అతిపెద్ద మౌలిక వసతుల ప్రాజెక్టుగా పేర్కొంటున్న ప్రపంచంలోనే ప్రతిపాదిత అతిపెద్ద డ్యామ్ నదీ పరివాహక దేశాలు భారత్, బంగ్లాదేశ్‌లలో ఆందోళనలు కలిగిస్తోంది. డ్యామ్‌పై మొత్తం పెట్టుబడి ఒక ట్రిలియన్ యువాన్లు (137 బిలియన్ డాలర్లు) దాటిపోగలదు. ప్రపంచంలోనే అతిపెద్దదిగా పరిగణిస్తున్న చైనా సొంత త్రీ గార్జెస్ డ్యామ్ సహా ఈ గ్రహంపై ఏ ఇతర ఒక్క మౌలికవసతుల ప్రాజెక్టు ఖర్చును మరుగుజ్జును చేస్తుంది. హిమాలయ పర్వత ప్రాంతంలో ఒక భారీ లోయలో డ్యామ్‌ను నిర్మించడమన్నది పొరుగున ఉన్న మనపై జలయుద్ధ ట్యాంకును ఎక్కు పెట్టడమే. కైలాస శిఖరం నుంచి టిబెట్ మీదుగా భారత్, బంగ్లాదేశ్‌లకు పేర్ల మార్పుతో ప్రవహిస్తున్న నదిపై మెగా డ్యామ్‌ల నిర్మాణం గురించి పోటాపోటీగా వ్యవహరిస్తున్నా రెండు దేశాలు సీమాంతర నదులకు సంబంధించిన వివిధ అంశాలను చర్చించేందుకు 2006లో నిపుణుల స్థాయి యంత్రాంగం ను ఏర్పాటు చేశాయి. దాని కింద వరద కాలాల్లో బ్రహ్మపుత్ర నది, స్లటెజ్ నదికి సంబంధించి జలప్రవాహ సమాచారాన్ని భారత్‌కు చైనా అందజేస్తున్నది. సరిహద్దు అంశానికి సంబంధించి భారత, చైనా ప్రత్యేక ప్రతినిధులు ఎన్‌ఎస్‌ఎ అజిత్ దోవల్, చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యి మధ్య డిసెంబర్ 18న బీజింగ్‌లో జరిగిన చర్చల్లో సీమాంతర నదుల డేటా పంచుకోవడమైంది. సీమాంతర దేశాలపై దూకుడుగా వ్యవహరించేందుకు తన డ్యామ్‌లను ఉపయోగించుకుంటున్న చరిత్ర చైనాది. ఏడాది పొడుగునా వర్షపాతంలో గణనీయమైన పెరుగుదల ఉన్నది. జూలై, సెప్టెంబర్ మధ్య గరిష్ఠంగా ఉంటుంది. బ్రహ్మపుత్ర నది రెండు అధిక నీటిమట్టం సీజన్‌లను చూస్తుంటుంది. ఈ క్రమంలో బ్రహ్మపుత్ర ద్వారా నీటిని ఒక్కసారిగా వదిలితే అది భారత్‌ను ముంచెత్తే ప్రమాదం ఉందన్న ఆందోళన వస్తోంది. దీంతో దీనిపై భారత్ గట్టిగానే వ్యతిరేకిస్తున్నా..అడ్డుకోవడమే మంచిది.

## ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల్లో విస్తృత ప్రచారం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల పై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సమాచార శాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగులకు నూతన టెక్నాలజీతో కూడిన ఫోటో కెమెరాలను మంత్రి అందచేశారు. రాష్ట్రంలో జిల్లా, క్షేత్ర స్థాయి సిబ్బందికి నూతన కెమెరాలను అందచేయడం వలన ఎప్పటికప్పుడు కార్యక్రమ ఫోటో వార్తలు మీడియాకు సులువుగా అందించవచ్చునని కమిషనర్ డాక్టర్ హరీష్ తెలిపారు. అన్ని జిల్లా కార్యాలయాలకు, డివిజన్ స్థాయి సిబ్బందికి ఫోటో కెమెరాలను అందచేస్తున్నట్లు ఆయన తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ ఫోటో కెమెరాలు సిబ్బందికి ప్రయోజనకరంగా ఉంటాయని కమిషనర్ పేరొన్నారు. క్షేత్ర స్థాయిలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొనే ప్రతి కార్యక్రమంలో సమాచార శాఖ సిబ్బంది విరివిగా పాల్గొంటు ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ డా.హరీష్, అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎవడయ్యా మహాసభ పెట్టింది?

**కనీసం సీఎం పేరు తెలీయదా.?**

**ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**ప్రజానావ, హైదరాబాద్:** తెలుగు మహాసభల్లో సీఎం రేవంత్ రెడ్డి పేరు మర్చిపోయిన యాంకర్ బాలాదిత్యపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఎవరో తెలవని వాళ్లు యాంకర్ అవుతారా అంటూ మండిపడ్డారు. తెలుగు మహాసభలు పెట్టిన వారికి బుద్ధి లేదా, అసలు ఆ సభలు పెట్టింది ఎవరంటూ ఫైరయ్యారు. ఎంపీగా ఉన్న నేనే పేపర్లలో రాసుకుని చదువుతున్నా.. ఒక ముఖ్యమంత్రి వస్తున్నప్పుడు ఏ సీఎం వస్తున్నడో తెలియకుండా యాంకర్ చదువుతడా అని విమర్శించారు. ముఖ్యమంత్రి పేరు చెప్పకపోవడం వెనుక ఎదో కుట్ర ఉందన్నారు.

**అసలేం జరిగిందంటే..**

హైదరాబాద్ హైటెక్స్‌లోని హెచ్ఐసీసీలో జరుగుతున్న ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు సీఎం రేవంత్ రెడ్డి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిని హోస్ట్‌గా వ్యవహరిస్తున్న సినీ నటుడు బాలాదిత్య ఆహ్వానించారు. అప్పుడు మన ప్రియతమ నాయకులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ కిరణ్‌కుమార్ గారు అంటూ ఉచ్ఛరించాడు. యాంకర్ నోటి నుంచి సీఎం కిరణ్‌కుమార్ అని రావడంతో సభ కింద ఉన్నవారంతా ఒక్కసారిగా కేకలు వేశారు. దీంతో తాను చేసిన తప్పును యాంకర్ గ్రహించాడు. ఆ వెంటనే తన తల పట్టుకుని స్టేజిపై నుంచి పక్కకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత మళ్లీ వచ్చి తన క్షమాపణలు చెప్పాడు. సీఎం రేవంత్ రెడ్డి అంటూ ఉచ్ఛరించాడు.



## గరికపాటిపై అభ్యంతరకర ప్రచారాలు

**చట్టప్రకారం చర్యలు తప్పవని బృందం హెచ్చరిక**

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ఆయన బృందం స్పందించింది. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న దుష్ప్రచారం ఆయన కుటుంబసభ్యులతో పాటు అభిమానులను కలత పెడుతోందని తెలిపింది. ఈ మేరకు గరికపాటి సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. 'ఇటీవల కొందరు వ్యక్తులు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు తప్పుడు ప్రచారంతో పరువు తీస్తున్నారు. గరికపాటిపై వారు చేసిన ఆరోపణలన్నీ నిరాధారం.. సత్యదూరం. వేర్వేరు ఘటనల్లో ఎవరెవరికో చెప్పని క్షమాపణలు చెప్పినట్లుగా పేర్కొంటూ ఆయన గౌరవానికి భంగం కలిగించేలా ప్రచారం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా పారితోషికాలు, ఆస్తుల విషయంలో కూడా అసత్య ప్రచారం జరుగుతోంది. వీటన్నింటినీ మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానళ్లు, సంస్థలపై క్రిమినల్, పరువు నష్టం కేసులు వేస్తాం. ఇకపై అలాంటి దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

## ఢిల్లీ ఎన్నికల మోగిన నగారా

**10న నోటిఫికేషన్ విడుదల.. 17 వరకు నామినేషన్ల స్వీకరణ**

**20 వరకు నామినేషన్ల ఉపసంహకరణ**

**మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్**



**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23తో ప్రస్తుత అసెంబ్లీ గడవు ముగుస్తుండటంతో ఆలోపే నూతన ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఢిల్లీ అంతటా ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నట్లు పేర్కొంది. జనవరి 10న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. జనవరి 17 వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. జనవరి 20 వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. షెడ్యూల్ విడుదల సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఈవీఎంలపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంపై క్లారిటీ ఇచ్చారు. ఓటర్ లిస్ట్ ట్యాంపరింగ్ జరిగిందన్న ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపింది. ఈవీఎంలను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని స్పష్టం చేసింది. గత ఏడాది ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేసింది. దేశంలో ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందని, మహిళా ఓటర్ల సంఖ్య 48 కోట్లు దాటిందని సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు. ఈ ఏడాది తొలి ఎన్నికలు ఢిల్లీలో జరగబోతున్నాయని అన్నారు. ఢిల్లీలో అన్ని ప్రాంతాల ఓటర్లు ఉంటారని పేర్కొన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు సీఈసీ రాజీవ్‌కుమార్ ఖండించారు. ఈవీఎంలతోనే ఫలితాలు పారదర్శకంగా ఉంటాయని, ఈవీఎంల రిగ్గింగ్ జరిగినట్లు ఇంతవరకు ఎక్కడా నిరూపణ కాలేదని ఆయన తెలిపారు. ఈవీఎంల రిగ్గింగ్ సాధ్యం కాదని చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఇదే తనకు చివరి ప్రెస్ మీట్ అని సీఈసీ చెప్పారు. ఓటింగ్ శాతంపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తుండటంపై కూడా సీఈసీ స్పందించారు. పోలింగ్ రోజు సాయంత్రం 6 గంటలకు కచ్చితమైన పోలింగ్ శాతం వెల్లడించడం సాధ్యం కాదని అన్నారు.



# రాజన్న హుండీ ఆదాయం 1.28కోట్లు

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఏడు రోజుల హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారులు మంగళవారం లెక్కించారు. ఈ లెక్కింపులో నగదు రూ. 1,28,77,106 రాగా, బంగారం 305 గ్రాములు, వెండి 8 కిలోల 200 గ్రాములు సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి వినోద్ రెడ్డి వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో కార్యనిర్వహణాధికారి వినోద్ రెడ్డి, ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈఓలు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్పీఎఫ్, హోంగార్డు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చూడగా, శివ రామకృష్ణ భజన మండలి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

# 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే

## ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లకు వినతి పత్రాలు



**ప్రజానావ, సిరిసిల్ల:** ఎన్నికల హామీల్లో భాగంగా కామారెడ్డి బహిరంగ సభలో ప్రకటించిన విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఓబీసీ మోర్చా డిమాండ్ చేసింది. ఓబీసీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా స్థానిక తహసీల్దార్లకు వినతి పత్రాలను నాయకులు అందించారు. ఈ మేరకు సిరిసిల్ల పట్టణ ఓబీసీ అధ్యక్షుడు అకారపు రాజు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో పాటు గతేడాది, ప్రస్తుతం ఏడాది కలిపి రూ. 40వేల కోట్లను వచ్చే బడ్జెట్‌లో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుంటే బీజేపీ ఓబీసీ మోర్చా గ్రామస్థాయి నుంచి ఉద్యమం చేపట్టి బీసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెల్లి వేణుగోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి శ్రీనివాస్, గౌడ సెల్ రాష్ట్ర కన్వీనర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొల్గం నాగరాజు, అసెంబ్లీ కన్వీనర్ మ్యన రాంప్రసాద్, బీజేపీ జిల్లా కార్యదర్శి గజబింకర్ చందు, జిల్లా అధికార ప్రతినిధి ఠాకూర్ రాజ్ సింగ్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఊరగొండ రాజు మోరా శ్రీహరి, పట్టణ కార్యదర్శి సుంకోజు రమేశ్ చారి. మాజీ కౌన్సిలర్ మాసం భాస్కర్, పోతు శ్రీనివాస్, వేముల పోశెట్టి, చిలుక శ్రీకాంత్, గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె విరమమించిన సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు

## గన్నేరువరం ఎమ్మార్సీ కార్యాలయం నుంచి కదలని టీచర్

**ప్రజానావ, గన్నేరువరం:** రాష్ట్రంలో సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె విరమించినప్పటికీ గన్నేరువరం ఎమ్మార్సీ కార్యాలయంలోనే పలువురు టీచర్లు కొనసాగుతున్నారని ప్రభుత్వ ఉపాధ్యాయుడు టీజీబీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాం రాజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలోని గన్నేరువరం ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రత్యామ్నాయంగా ఒక టీచర్‌ను "ఓరల్ డిప్యుటేషన్" (మౌఖిక ఆదేశాల) మేరకు జిల్లా స్థాయి అధికారులు వారి ఆదేశానుసారం గన్నేరువరం మండలం ఇన్‌చార్జి ఎంఈఓ రామయ్య మైలారం పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై పంపించడం జరిగింది. సమ్మె విరమించినప్పటికీ సదరు టీచర్‌ను గన్నేరువరం ఎమ్మార్సీ కార్యాలయంలోనే కొనసాగించడం గమనార్హం. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మాతృ సంస్థ మైలారం పాఠశాలకు పంపించాలని రాం. రాజయ్య కోరారు.

# కాంగ్రెస్ గుండాగిరి చేస్తోంది

## బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని ఖండించిన కృష్ణారెడ్డి



**ప్రజానావ, కరీంనగర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ గుండాగిరి మొదలుపెట్టిందని, బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ విస్మరించిందని, కేవలం రౌడీయిజాన్ని నమ్ముకొని దాడులు చేస్తుందన్నారు. ఆ దిశలోనే బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు రాళ్లు , కోడిగుడ్లతో దాడులు చేశారని.. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యవాదులంతా ఇలాంటి దాడులను ఖండించాలని పిలుపునిచ్చారు. దాడులు చేసిన కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్టు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ బీజేపీ కార్యాలయంపై జరిగిన దాడికి సమాధానం చెప్పాలన్నారు.



# చాణక్య నర్సింగ్ హోం సీజ్

## నిబంధనలు పాటించడం లేదని తాత్కాలికంగా రిజిస్ట్రేషన్ రద్దు

**ప్రజానావ, వేములవాడ:** ఆస్పత్రి నిర్వహణకు కావాల్సిన అనుమతులు, నిబంధనల మేరకు లేకపోవడంతో వేములవాడ పట్టణంలోని చాణక్య నర్సింగ్ హోంని మంగళవారం అధికారులు సీజ్ చేశారు. జిల్లా వైద్యాధికారిణి రజిత, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, సీఐ వీరప్రసాద్‌లు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రి నిర్వహణకు సంబంధించి మున్సిపల్ శాఖ, ఇతల అనుమతులు సక్రమంగా లేకపోవడంతో సీజ్ చేస్తున్నట్లు వైద్యాధికారిణి రజిత తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న చాణక్య నర్సింగ్ హోమ్ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసుపత్రిని స్థానిక ఆర్డీఓ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, పట్టణ సీఐ వీర ప్రసాద్ నేతృత్వంలో సందర్శించి ఆసుపత్రిని సీజ్ చేస్తున్నట్లు మీడియాతో తెలిపారు. అయితే దీనిపై ఆసుపత్రి యాజమాన్యం స్పందిస్తూ గత కొన్ని దశాబ్దాలుగా ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆసుపత్రిని నిర్వహిస్తున్నామని, కొంతమంది వ్యక్తులు కక్షపూరితంగా ఇలాంటి చర్యలకు అధికారులతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.




# పాత్రికేయుడు శ్రీనివాస్‌కు సన్మానం



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణానికి చెందిన పాత్రికేయుడు కొల్లూరి శ్రీనివాస్ ఎన్యూజే (ఐ) నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికైన సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు సిద్ధంశెట్టి వేణు మాట్లాడుతూ ఎన్యూజే (ఐ) నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా ఆర్యవైశ్య కుల బాంధవుడు, పాత్రికేయుడు కొల్లూరి శ్రీనివాస్ గుప్తా ఎన్నిక కావడం అభినందనీయమని, ఇలాంటి ఉన్నత పదవులు కొల్లూరి శ్రీనివాస్ కు మరెన్నో వరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాస్, కటకం శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త అనిల్, మద్ది సత్య నారాయణ, గౌరవ సభ్యులు పోకల అశోక్, పట్టణ సేవాదల్ కమిటీ అధ్యక్షుడు మాడిశెట్టి కృపాల్ పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి




**ప్రజానావ, పెద్దపల్లి:** రోడ్డు భద్రత నిబంధనలు వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని పెద్దపల్లి ఇన్‌చార్జి డీటీఓ ఎస్కే మసూద్ అలీ, ఎంవీఐ స్వప్న, ఏఎంవీఐ మధు పిలుపునిచ్చారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలో విద్యార్థులకు, సుల్తానాబాద్ లో లారీ ఓనర్లు, డ్రైవర్లకు మంగళవారం రోడ్డు భద్రత నిబంధనలపై వేర్వేరుగా అవగాహన కల్పించారు. వాహనాలకు అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. వేగం కన్నా ప్రాణం ముఖ్యమని వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. విద్యార్థులు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ నాయకులు, సభ్యులు, విద్యార్థులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా: కాంగ్రెస్



**ప్రజానావ, కరీంనగర్:** బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమ ప్రయోజనాల గురించి ఆలోచిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రయోజనాల గురించి ఆలోచిస్తుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి రాష్ట్రంలో అమలు చేయబోతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ కరీంనగర్ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పురం రాజేశం ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద మంగళవారం సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లాకు చెందిన ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడంతో పాటు టపాసులు కాల్చి, పార్టీ కార్యకర్తలకు, పాదచారులకు మిఠాయిలు పంచారు. అనంతరం కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మొన్న సీఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర కేబినెట్ మీటింగ్‌లో తీర్మానం చేసి రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్లాలి.. గత ప్రభుత్వం రైతుబంధు పేరిట గుట్టలు, కొండలకు, బీడుబడ్డ భూములకు రైతుబంధు ఇచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఇప్పుడు ఆ విధంగా జరగకూడదనే ఉద్దేశంతో ఎవరైతే ఆరుగాలం కష్టపడి పంటను పండిస్తారో ఆ రైతన్నకు రైతు భరోసా అందించాలని ఇటీవల రూ.500 బోనస్ పొంది లాభపడ్డ నిజమైన రైతులను గుర్తించిన విధంగానే రైతు భరోసాను పంట వేసే భూములకు అందించాలన్నారు. భూమిలేని రైతు కూలీలకు కూడా రూ.12 వేలు ఆర్థిక సహాయాన్ని అందించాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి కి కేబినెట్ మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మీడియా హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు




**ప్రజానావ, పెద్దపల్లి:** మీడియా హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ లో హత్యకు గురైన జర్నలిస్టు చంద్రకార్ కు పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో మంగళవారం నివాళులర్పించారు. టీయూడబ్ల్యూజే దాడుల నివారణ కమిటీ జిల్లా కన్వీనర్ సీపెల్లి రాజేశం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పెద్దపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతకింది చంద్రమొగిలి, నారాయణదాసు. అశోక్, టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షుడు ముదిమడుగుల మల్లన్న, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ మార్వాడి సుదర్శన్, రైతు సంఘం నాయకుడు, సామాజిక ఉద్యమకారుడు ఎరుకల రాజన్న, విరసం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, తెలంగాణ పీపుల్స్ జేఏసీ నాయకులు పొన్నం రాజమల్లయ్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, కో కన్వీనర్ గాండ్ల మల్లేశం మాట్లాడుతూ బస్తర్‌లో జర్నలిస్టు చంద్రకార్ హత్యను తీవ్రంగా ఖండించారు. చంద్రకార్ హత్యపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన జర్నలిస్టు కుటుంబానికి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులు, హత్యలు నిరోధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్న పాలకులు దోపిడీదారులు అక్రమాలను వెలుగులోకి తీస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం, హత్యలకు పాల్పడడం ఆటవిక చర్యలని అన్నారు. ప్రజల జీవన విధానాన్ని ధ్వంసం చేస్తున్న వారి అక్రమాలను మీడియా వెలుగులోకి తీస్తుంటే తట్టుకోలేని అక్రమార్కులు రాజ్యం ముసుగులో దాడులకు తెగబడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యం పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు ప్రజా సంఘాలు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. రాజ్యం కుట్రలను తిప్పికొట్టడంలో జర్నలిస్టులు నిర్భయంగా నిజాలను వెలికితీసి ప్రజలకు వివరించాలని సూచించారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాలకులు వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్ మీడియా హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత పాలకులదేనని అన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రమొగిలి, అశోక్, దాడుల నివారణ కమిటీ కన్వీనర్ సీపెల్ళి రాజేశం, టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు వీరమల్ల విద్యాసాగర్ రావు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనకు సంఘాలకు అతీతంగా కలిసి కట్టుగా పోరాడుదామని అన్నారు. పాలకులు ద్వంద్వ వైఖరి విడనాడి జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేలా ప్రత్యేక చట్టాలు రూపొందించి అమలు చేయాలని కోరారు. అంతకుముందు ఇటీవల మృతిచెందిన జర్నలిస్టు అమరులకు నివాళులర్పించారు. సమావేశంలో జర్నలిస్టు సంఘాల నాయకులు దొమ్మటి రాజేష్, జిలకర రమేష్, మొదుంపల్లి సాగర్, ఈదునూరు జైపాల్, జాపతి సంజీవ్, శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# పీవీ పుట్టిన గడ్డపై 'నవోదయ' విద్యాలయం

- ప్రతి మండలంలో పీఎం శ్రీ కింద రెండు పాఠశాలలను స్థాపించండి
- కరీంనగర్‌లో టెక్నికల్ యూనివర్సిటీని స్థాపించండి
- కేంద్ర విద్యాశాఖ మంత్రికి బండి సంజయ్ వినతి
- సానుకూలంగా ధర్మేంద్ర ప్రదాన్



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ పీవీ నర్సింహారావు జన్మించిన 'వంగర'లో నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. దీంతోపాటు సిరిసిల్ల జిల్లాలోనూ నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు న్యూఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. తెలంగాణలో కొత్తగా 18 జిల్లాల్లో నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. అయితే అందులో సిద్దిపేట జిల్లా అంశం ప్రస్తావన లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని బండి సంజయ్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన బండి సంజయ్ సిద్దిపేటలోని హుస్నాబాద్ నియోజకవర్గం వంగరలో నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ కు విజప్తి చేశారు. దీంతోపాటు తెలంగాణలోని ప్రతి జిల్లాలో నవోదయ విద్యాలయాన్న ఏర్పాటు చేయాలని, అందులో భాగంగా సిరిసిల్ల జిల్లాలోనూ నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రతి మండలంలో రెండు పాఠశాలలను ప్రధానమంత్రి శ్రీ స్కీమ్ కింద స్థాపించాలని అభ్యర్థించారు. ఈ స్కీం కింద ఎంపికైన ప్రతి పాఠశాలకు రూ.40 లక్షల చొప్పున నిధులు మంజూరవుతాయని, తద్వారా ఆయా పాఠశాలలను సమగ్రాభివృద్ధి చచేసే అవకాశం ఏర్పడనుందని వివరించారు. అలాగే కరీంనగర్ జిల్లాలో టెక్నికల్ యూనివర్సిటీ స్థాపించాలని కోరుతూ బండి సంజయ్ కేంద్ర మంత్రికి మరో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ యూనివర్సిటీ అవసరాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. తన పార్లమెంట్ నియోజకవర్గంలో నైపుణ్య అభివృద్ధి, టెక్నికల్ విద్యను ప్రోత్సహించడానికి యూనివర్సిటీ కీలకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. అధునాతన విద్యాసంస్థల కొరతను తీర్చడం ద్వారా యువతకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు అందించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రాంతీయ అభివృద్ధిని వేగవంతం చేయడానికి ఈ ప్రాజెక్ట్ అత్యవసరమని పేర్కొన్నారు. బండి సంజయ్ వినతి పట్ల సానుకూలంగా స్పందించిన ధర్మేంద్ర ప్రదాన్ తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## విద్యార్థులకు బీజేపీ నేతల పరామర్శ



**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్ పట్టణం శర్మ నగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలోని 23మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. మంగళవారం స్థానిక బీజేపీ శ్రేణులు ఆసుపత్రికి తరలివెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని, ఫుడ్ పాయిజన్ గల కారణాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యాలతో జీవితాలతో చెలగాటమాడుతుందని నిత్యం రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం తగిన నివారణ చర్యలు చేపట్టడం లేదని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగల పవన్, కొలగని శ్రీనివాస్, కటకం లోకేష్, నాగసముద్రం ప్రవీణ్, శివారెడ్డి, పాదం శివరాజు, కరండ్ల రతన్, సంతోష్, సీనియర్ నాయకులు ఓదెలు, నాంపల్లి శ్రీనివాస్, చడా ఆనంద్, మాసం గణేశ్, పొన్నం మొండన్న, బండారు గాయత్రి, సత్యనారాయణ, కేంచ శేఖర్, ఉప్పరపెల్లి శ్రీనివాస్, శ్రీరాముల శ్రీకాంత్, ఈస్సాపెల్లి మహేశ్, అనిల్, అశోక్, భారత్, వినయ్, సురేశ్, ఆనంద్, నరేశ్, మహేశ్ పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



**ప్రజానావ, బెజ్జంకి:** బెజ్జంకి మండలం గుండారం కల్లేపల్లి ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు వరంగల్ జిల్లాలోని పరకాల పట్టణంలోని నేషనల్ స్టేడియంలో రాజీవ్ గాంధీ మెమోరియల్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించినట్లు కరాటే శిక్షణ ఉపాధ్యాయులు దేవులపల్లి రజిత వైష్ణవి, శ్రీనివాస్ తెలిపారు. గుండారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఎం. అక్షిత గోల్డ్ మెడల్, బీ.లావణ్య సిల్వర్ మెడల్ పీ. స్ఫూర్తి బ్రౌన్జ్ మెడల్ సాధించారన్నారు. అలాగే కల్లెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం. అశ్విత గోల్డ్ మెడల్, బీ. ఆరాధ్య బ్రౌంజ్ మెడల్ పొందారని కరాటే శిక్షకురాలు దేవులపల్లి రజిత వైష్ణవి తెలిపారు. గుండారం, కల్లేపల్లి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నూగూరి నాగవేణి, భారతి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం, పలువురు గ్రామస్తులు మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే గుణపాఠం చెబుతారు



**ప్రజానావ, బెజ్జంకి:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను వంచించిందని, ఈ ద్రోహాన్ని తెలంగాణ రైతాంగం క్షమించబోదని బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు బండిపెల్లి సతీష్ గౌడ్ ఆరోపించారు. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామంటూ హామీ ఇచ్చి.. రూ.12వేలకే పరిమితమవడం రైతులను వంచించడమేనని ఆయన విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులు నమ్మి ఓటు వేయగా కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వైఖరితో వ్యవహరిస్తోందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హామీ ఇవ్వకపోయినా రైతు బంధువుగా నిలిచారని, కానీ రేవంత్ రెడ్డి రైతు రాబందుగా మిగిలిపోయారని విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్ అమలు చేసే సామర్థ్యం కాంగ్రెస్‌కు లేదని, తెలంగాణలో వారి హవా సాగదని ధ్వజమెత్తారు. ఇచ్చిన మాట తప్పడమే ఇందిరమ్మ రాజ్యమా, ఇచ్చిన 420 హామీలు ఆరు గ్యారెంటీలు అమలు చేసేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల పక్షాన నిలదీస్తూనే ఉంటామని సతీష్ హెచ్చరించారు.

## బీజేపీని ఎదుర్కొలేకనే దాడులు

**బీజేపీ కార్యాలయంపై జరిగిన దాడిన ఖండించిన చింతల**



**ప్రజానావ, ఖైరతాబాద్:** బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి ఖండించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీని రాజకీయంగా ఎదుర్కొనలేకనే కాంగ్రెస్ అల్లరిమూకలు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన బూటకపు వాగ్దానాలతో పాటు ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బీజేపీని కాంగ్రెస్ పార్టీ, రేవంత్ అనుచరులు ఇలా బెదిరించడం సరికాదన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేసిన నిందితులను పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బీజేపీ పార్టీ కార్యకర్తలు తలుచుకుంటే దేశం నలుమూలల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ఉండవని, కాంగ్రెస్ ప్రతినిధులు రోడ్లపైకి కూడా రాలేరని హెచ్చరించారు. రేవంత్ సర్కారు అరాచకాలకు ప్రజలు వడ్డీతో బదులుచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చింతల పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులు కొనసాగిస్తాం

**సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్**



**ప్రజానావ, సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గత పదేళ్ల కాలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిరాటంకంగా కొనసాగిస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫలమండీ డివిజన్ పరిధిలో మంగళవారం ఆయన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతాఫలమండీ పరిధిలో కొత్తగా రూ.10 కోట్ల ఖర్చుతో నాలా విస్తరణ పనులకు ఆమోదం లభించిందని తెలిపారు. మహమ్మద్ గూడా వద్ద సివరేజ్ సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన ఏర్పాట్లు జరపాలని పద్మారావు గౌడ్ ఆదేశించారు. ఈ సందర్భంగా మహమ్మద్ గుడా లో రూ.8 లక్షల ఖర్చుతో సివరేజ్ లైన్ ఏర్పాటు పనులను, ఇందిరా నగర్ కాలనీలో రూ.18 లక్షల ఖర్చుతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సామల హేమ తో కలిసి ప్రారంభించారు. కార్పొరేటర్ సామల హేమ మాట్లాడుతూ సీతాఫలమండీ డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని, ఎమ్మెల్యే సహకారంతో వివిధ ముఖ్యమైన పనులను చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు విద్యా సాగర్, నవ్య, స్వర్ణ లత, కౌశిక్, నాయకులు కరాటే రాజు, బీఆర్ఎస్ సమన్వయకర్త రాజ సుందర్, మహమ్మద్ గూడా, ఇందిరానగర్ సంక్షేమ సంఘాల నేతలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## త్వరితగతిన కుట్టి వెల్లోడి ఆస్పత్రి నిర్మాణం పనులు

**ప్రజానావ, సికింద్రాబాద్:** సీతాఫలమండీ లో నిర్మిస్తున్న కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి భవనాల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిద్దుతామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫలమండీ కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను అధికారులతో కలిసి పద్మారావు గౌడ్ మంగళవారం తనిఖీ చేశారు. నిర్మాణం పనుల్లో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న స్లాబ్ నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.12 కోట్లతో నిర్మిస్తున్న సితాఫలమండీ కుట్టి వెల్లోడి ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వ హయంలో ప్రత్యేక అనుమతులు సాధించామని, నిర్మాణం పనుల్లో నాణ్యతకు ప్రాముఖ్యతను కల్పించి వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సామల హేమ, వైద్య శాఖ ఇంజినీరింగ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



## మందమర్రిలో కార్డెన్‌సెర్చ్

**ప్రజానావ, మందమర్రి :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అంగడిబజార్ ఏరియాలో మంగళవారం సీఐ శశిధర్ రెడ్డి తన బృందంతో కార్డెన్‌సెర్చ్ చేశారు. 34 ద్విచక్ర వాహనాలు, 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. పట్టుబడ్డ 34 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఐదు లీటర్ల గుడుంబా తో పట్టుబడ్డ మహిళ అదే ఏరియా కు చెందిన మరో వ్యక్తి వద్ద కూడా ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని ఇరువురి పై కేసు కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఎస్సైలు పాల్గొన్నారు.

## కళాశాలను సందర్శించిన ఎమ్మెల్సీ అభ్యర్థి



**ప్రజానావ, గజ్వేల్:** తాను రాజీనామా చేసిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా. ప్రసన్న హరికృష్ణ సందర్శించారు. గజ్వేల్ పట్టణంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను మంగళవారం సందర్శించి, అక్కడ వారి కోరిక మేరకు కెరీర్ గైడెన్స్ కు సంబంధించి మోటివేషనల్ క్లాస్‌లో పాల్గొన్నారు. మధ్యాహ్నం సమయంలో గజ్వేల్ పురుషుల డిగ్రీ కళాశాలను సందర్శించి అధ్యాపకులతో ముఖాముఖీ సమావేశం నిర్వహించి, గజ్వేల్ పట్టణంలో ఉన్న జ్ఞాన సరస్వతి ఒకేషనల్ జూనియర్ కళాశాల యాజమాన్యం, అధ్యాపక మిత్రులను ఆత్మీయంగా కలుసుకొని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం సిద్దిపేటలో ఉన్న విజేత ఎస్ఐ, కానిస్టేబుల్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులతో కలిసి వారికి తన అమూల్యమైన సలహాలు, సూచనలు అందించారు.



## ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి అప్పగింత

**వివరాలు వెల్లడించిన కలెక్టర్, ఎస్పీ**

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** జిల్లాలో ఆక్రమణకు గురైన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన సున్చుల కుమారస్వామి తిరిగి ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం లో ప్రభుత్వ భూమి అప్పగింత పై ఎస్పీ అఖిల్ మహజన్ తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన సంచుల కుమారస్వామి గ్రామ సర్వే నెంబర్ 464లో గల 3 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసుకుని సాగు చేసుకుంటున్నాడని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడానికి నిర్ణయించారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడి ఉంటే సదురు భూమిని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని, ఈ భూములను పేద ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తామని, పేద ప్రజలకు ఇంటి పట్టాల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. 2018 నుంచి 2023 వరకు ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉంటూ రైతు బంధు, పీఎం కిసాన్ మొదలైన ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందినందుకు ఆ సొమ్ము రికవరీ కోసం డిమాండ్ నోటీసు జారీ చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా దాదాపు 250 ఎకరాలు ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# బీజీటీలో షమీ ఉంటే ఆ లెక్కే వేరు..




## షమీని ఆసీస్ టూర్ కు తీసుకొస్తే బాగుండేది బీసీసీఐపై మాజీ కోచ్ రవి శాస్త్రి ఆగ్రహం

**న్యూఢిల్లీ:** ప్లేయర్ల ఫిట్ నెస్ పై బీసీసీఐ వ్యవహార ధోరణిని మాజీ కోచ్ రవి శాస్త్రి కడిగిపారేశాడు. ముఖ్యంగా స్టార్ పేసర్ మహ్మద్ షమీ.. గాయం కారణంగా సుదీర్ఘంగా క్రికెట్ కు దూరంగా ఉండటం ఏంటని ప్రశ్నించాడు. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో ఇన్నాళ్లుగా షమీతో ఏం చేస్తున్నారని అడిగాడు. నిజానికి బోర్డర్- గావస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు తోడుగా షమీ ఉంటే కథ వేరేగా ఉండేదని చాలామంది అభిప్రాయ పడ్డారు. సిరీస్ సగం ముగిసిన తర్వాత షమీని పిలిపించాలని కూడా డిమాండ్లు వెల్లువెత్తాయి. అయితే బీసీసీఐ ధోరణితో ఆటగాళ్ల పునరావాసంపై ప్రశ్నలు రేకెత్తుతున్నాయని శాస్త్రి విమర్శించాడు. ఆటగాళ్ల గాయాల అప్డేట్ పై ఇంత గోప్యం ఎందుకని, ఎప్పటికప్పుడు అప్డేట్ ఇవ్వాలని సూచించాడు. నిజానికి 2023 ప్రపంచ కప్ వన్డే ఫైనల్ తర్వాత చీలమండ గాయంతో షమీ జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత ఏడాది తనకు శస్త్ర చికిత్స కూడా జరిగింది. అప్పటి నుంచి షమీ కోలుకుంటూనే ఉన్నాడు. జాతీయ క్రికెట్ అకాడమీలో పునరావాసం పొందుతున్నాడు. అయితే రిహాబిలిటేషన్ ను జట్టుతో పాటే కొనసాగించి ఉంటే బాగుండేదని శాస్త్రి అభిప్రాయ పడ్డాడు. అతడిని టీమిండియాతో పాటు ఆసీస్ టూర్ కు తీసుకొచ్చి, ఎప్పటికప్పుడు మోనిటర్ చేస్తే మంచి ఫలితాలు ఉండేవని వ్యాఖ్యానించాడు. అంతర్జాతీయ ఫిజియోలతో కలిసి ఈ విషయంలో ఇంకాస్త మెరుగ్గా వర్కౌట్ చేసి ఉంటే బాగుండేదని పేర్కొన్నాడు. షమీ లేని లోటు బీజీటీలో స్పష్టంగా కనిపించిందని వ్యాఖ్యానించాడు. బుమ్రాకు తోడుగా అతనుంటే ఫలితాలు వేరేగా వచ్చేవని పేర్కొన్నాడు. ఇక షమీ లేని లోటుతో బౌలింగ్ భారం బుమ్రా, సిరాజ్ లపైనే పడింది. ఇద్దరు సిరీస్ లో చెరో 150కిపైగా ఓవర్లు బౌలింగ్ చేశారు. ఇక ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అయితే ఒక అడుగు ముందుకేసి నాలుగో టెస్టు నుంచి షమీని ఆడిస్తే బాగుండేదని వ్యాఖ్యానించాడు. అప్పటికే జట్టులో బుమ్రా, సిరాజ్ ఉన్నారని వారికి తోడుగా షమీ ఆడేవాడని, రోజుకు కొన్ని ఓవర్లు చొప్పున అతడితో బౌలింగ్ వేస్తే బాగుండేదని, నితీశ్ రెడ్డి రూపంలో బ్యాకప్ పేసర్ కూడా అందుబాటులో ఉన్నాడని గుర్తు చేశాడు. ఈ సిరీస్ లో సిరాజ్ ఎంతో కష్టపడినప్పటికీ, అతనికి లక్కు కలిసి రాలేదని పేర్కొన్నాడు. అదే షమీ కూడా తోడుంటే టీమిండియాకు చాలా హెల్ప్ అయ్యుండేదని, బుమ్రా కూడా మధ్యలో గాయాల బారిన పడకుండా షమీ సలహాలు ఇచ్చేవాడని వ్యాఖ్యానించాడు. ఏదేమైనా టీమ్ మేనేజ్మెంట్ తప్పుడు ప్రణాళికలకు మూల్యం చెల్లించుకుంది. ఐదు టెస్టుల సిరీస్ ను 1-3తో చేజార్చుకుంది. దీంతో ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది.



## గిల్‌ను మూడు ఫార్మాట్లలో ఆడిస్తున్నారు

- గిల్ కంటే చాలామంది నాణ్యమైన ప్లేయర్లు ఉన్నారు
- సూర్య కుమార్‌కు చాన్స్ దొరికితే పాతుకుపోతాడు
- మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ మండిపాటు

**న్యూఢిల్లీ:** ఇటీవల ఆస్ట్రేలియా పర్యటన కొంతమంది ఇండియన్ ప్లేయర్లకు చేదు అనుభవాలు మిగిల్చింది. సినియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఘోరంగా విఫలమై జట్టులో చోటును ప్రశ్నార్థకం చేసుకున్నారు. కోహ్లీ ఐదు టెస్టులు ఆడగలిగాడు కానీ, చివరి టెస్టులో రోహిత్ పై వేటు పడిపోయింది. ఇక యువ ఆటగాళ్ల విషయానికొస్తే వన్ డౌన్ బ్యాటర్ శుభమాన్ గిల్ తీవ్రంగా నిరాశపరి చాడు. మూడు టెస్టులు ఆడిన గిల్.. 18 సగటుతో కేవలం 91 పరుగులు మాత్రమే చేశాడు. అతని అత్యధిక స్కోరు కేవలం 31 మాత్రమే కావడం గమనార్హం. ఇక గిల్ లాంటి ప్లేయర్లకు చాలా అవకాశాలు ఇవ్వడంపై మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ మండిపడ్డాడు. ఇన్ని చాన్సులు ఇచ్చినా అతను సద్వినియోగం చేసుకోలేదని మండిపడ్డాడు. గిల్ ను మూడు ఫార్మాట్లలో ఆడిస్తున్నారని, అయితే అతను చాలా ఓవర్ రేటేడ్ అని శ్రీకాంత్ వ్యాఖ్యానిం చాడు. గిల్ కు దొరికిన అవకాశాలు మరే ఇతర ఆటగాడికి లభించినట్లయితే అద్భుతాలు చేసి ఉండేవారని అభిప్రాయ పడ్డాడు. ఉదాహరణకు సూర్య కుమార్ యాదవ్ కు ఇన్ని చాన్సెస్ దొరికినట్లయితే టెస్టుల్లో పాతుకు పోయి ఉండేవాడని పేర్కొన్నాడు. తను ఒక టెస్టు మాత్రామే ఆడాడని, ఆ తర్వాత తనను పక్కన పెట్టి లిమిటెడ్ ఓవర్ల క్రికెట్ కు మాత్రమే పరిమితం చేశారని ఆరోపించాడు. ఇక యంగ్ ప్లేయర్ల కోసం చూసినట్లయితే సాయి సుదర్శన్, రుతురాజ్ గైక్వాడ్ రూపంలో చాలామంది నాణ్యమైన ప్లేయర్లు ఉన్నారని వ్యాఖ్యానించాడు. దేశవాళీల్లో టన్నుల కొద్ది పరుగులు సాధిస్తున్నా, రుతురాజ్ కు జాతీయజట్టులోకి పిలుపు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక సాయి సుదర్శన్ కూడా తరచూ ఇండియా ఏ తరపున విదేశీ టూర్లలో సత్తా చాటుతున్న తనను జాతీయ జట్టులోకి తీసుకోవడం లేదని శ్రీకాంత్ మండిపడ్డాడు. ఇలాంటి ఆటగాళ్లకు అవకాశం కల్పిస్తే బాగుంటుందని అభివర్ణించాడు. గిల్ తనకు దొరికిన అవకాశాలను వేస్ట్ చేసుకుంటున్నాడని, తనో ఓవర్ రేటెడ్ ప్లేయరని తెలిపాడు. తాను ముందు నుంచి ఇదే విషయాన్ని చెబుతున్నానని, ఇప్పుడది ప్రూవ్ అయిందని పేర్కొన్నాడు. దేశంలో ప్రతిభ గల యువకలకు కొదువ లేదని, ఇప్పటికైనా యువ ప్లేయర్లను ప్రొత్సహించాలని సూచించాడు. మరోవైపు గిల్ పై ప్రస్తుతమున్న సెలెక్షన్ కమిటీ చాలా నమ్మకముంచింది. గౌతం గంభీర్ కోచ్ గా పగ్గాలు చేపట్టాకా, లిమిటెడ్ ఓవర్ల క్రికెట్లో వైస్ కెప్టెన్ గా కూడా నియమించింది. అయితే స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంలో గిల్ తరచూ విఫలమవుతున్నాడు. తాజా ఆసీస్ పర్యటనలో తొలిసారి వెళ్లిన యశస్వి జైస్వాల్ అదరగొట్టాడు. తనే జట్టు తరపున లీడింగ్ స్కోరర్ గా నిలిచాడు. అయితే గిల్ కు గతంలో ఆసీస్ లో ఆడిన అనుభవం ఉన్నప్పటికీ, ఈసారి ఉస్సూరుమనిపించాడు. తన ఆటతీరు ఇలాగే కొనసాగితే ఉద్వాసన ఖాయమని మాజీలు హెచ్చరిస్తున్నారు.



## భారత్‌లో అభిమానులు చాలా క్రేజీగా ఉంటారు

### ఆస్ట్రేలియా టెస్ట్ కెప్టెన్ పాట్ కమిన్స్

**సిడ్నీ:** క్రికెటర్స్‌కు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఫ్యాన్స్ ఉండటం సహజమే. కొంత మంది ప్లేయర్స్ కైతే లేడీ ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఆ ఆటగాళ్ల గ్లామర్ కు, ఆటతీరుకు.. అమ్మాయిలు ఫిదా అవ్వడంతో పాటు వారిపై విపరీతంగా క్రష్ ఫీలింగ్‌ను పెంచేసుకుంటారు. వారితో ఒక్కసారి మాట్లాడితే చాలు, ఒక్క ఫొటో దిగితే చాలు అని తెగ ఆరాటపడిపోతుంటారు. అయితే తాజాగా 'డేట్ విత్ ఏ సూపర్ స్టార్' అనే షోలో పాల్గొన్న ఆస్ట్రేలియా టెస్ట్ కెప్టెన్ పాట్ కమిన్స్ తనపై ఉండే ఫీమేల్ అటెన్షన్‌ను ఎలా డీల్ చేస్తాడో చెప్పుకొచ్చాడు. తనపై అమ్మా యిలు చూపించే క్రష్ ఫీలింగ్ ను తాను ఎలా ఫీల్ అవుతాడో తెలిపాడు. 'మీకు ఇండియాలో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ముఖ్యంగా మహిళల్లో మీకు విశేష అభిమానగణం ఉంది. చాలా మంది అమ్మాయిలకు, మహిళలకు మీరంటే చాలా ఇష్టం. నాతో సహా నా బెస్ట్ ఫ్రెండ్, మిగతా మహిళలకు మీపై క్రష్ ఫీలింగ్ ఉంది. 'ఓ నువ్వు ప్యాట్ కమిన్స్‌ను కలుస్తున్నావా. నేను జెలసీగా ఫీలవుతున్నా' అని నా ఫ్రెండ్ నాతో మెసేజ్ కూడా చేసింది. మీకు పెళ్లి అయిందని ప్రతిఒక్కరికీ తెలుసు. కానీ మీరు ఇంతమంది అమ్మాయిల అభిమానాన్ని, ప్రేమను ఎలా సంపాదించుకో గలిగారు' అని హోస్ట్ సాహిబా బలి అడిగింది. దానికి కమిన్స్ ఆసక్తికరమైన సమాధానం చెప్పాడు. తనకు ఈ విషయాన్ని ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో తెలియట్లేదని అన్నాడు. కేవలం తన పని మాత్రమే తాను చేస్తానని చెప్పుకొచ్చాడు. అంతకుమించి ఎక్కువ ఆలోచించనని వెల్లడించాడు. "దీని గురించి ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో తెలీదు. కేవలం నా పని నేను చేసుకుంటూ ముందుకెళ్తాను అంతే. అంతకుమించి ఇంకేం లేదు" అని అన్నాడు. 'మీరు ఫీమేల్ అటెన్షన్ ను ఎలా ఆస్వాదిస్తారు' అని మళ్లీ అడగగా.. ఇండియాలో ఫ్యాన్స్ చాలా క్రేజీగా ఉంటారని చెప్పాడు కమిన్స్. "ఫన్నీగా చెబుతున్నాను. భారత్ లో అభిమానులు చాలా క్రేజీగా ఉంటారు. ప్లేయర్స్ దాదాపుగా ఎక్కువ సమయాన్ని తమ జట్టుతో పాటు హోటల్ లోనే గడుపుతారు. ప్లేయర్స్ ఫ్యామిలీలు కూడా తమతో పాటే ఉంటాయి. కాబట్టి చాలా సందర్భాల్లో వేరే వాళ్లతో పర్సనల్ గా మాట్లాడటం కూడా కుదరదు." అని పేర్కొన్నాడు. కాగా, ఆస్ట్రేలియా జట్టు విషయానికొస్తే, బోర్డర్ గావస్కర్ ట్రోఫీని పదేళ్ల తర్వాత సొంతం చేసుకుంది. గత రెండు పర్యాయాలు ఆస్ట్రేలియాలో టీమిండియా 2-1తో సిరీస్‌ను దక్కించుకుంది. అయితే ఈసారి కూడా విజయంతోనే సిరీస్ ప్రారంభించినా, ఆ తర్వాత గాడి తప్పింది. దీంతో ఆస్ట్రేలియా గావస్కర్ ట్రోఫీని గెలవడంతో పాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ 2025కు అర్హత సాధించింది. ఇప్పటికే దక్షిణాఫ్రికా ఫైనల్ చేరుకున్న సంగతి తెలిసిందే. దీంతో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ వేదికగా ఫైనల్ జరగనుంది. రెండేళ్ల క్రితం జరిగిన తుది పోరులో ఆస్ట్రేలియా జట్టు టీమిండిను ఓడించి, ట్రోఫీని ముద్దాడింది. వరుసగా ఇప్పుడు రెండోసారి ఫైనల్ కు చేరింది.

## నెలలుగా మద్యం తాగలే..

### ట్రావిస్ హెడ్ షాకింగ్ కామెంట్స్

**సిడ్నీ:** బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీని ఆస్ట్రేలియా 1-3 తేడాతో కైవసం చేసుకుంది. తొలి టెస్టులో గెలిచిన టీమిండియా ఒక్క మ్యాచ్ మినహా అన్ని మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ సమయంలో టీమ్ ఇండియాకు తలనొప్పి తెచ్చిపెట్టిన బ్యాట్స్‌మెన్ మరెవరో కాదు.. ట్రావిస్ హెడ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటి వరకు టీమిండియా బౌలర్లపై విరుచుకుపడిన ఏకైక ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ ట్రావిస్ హెడ్. ఈ బ్యాట్స్‌మన్ అప్పుడు 2023 వన్డే ప్రపంచకప్ నుంచి ఇప్పుడు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత బౌలర్లను దారుణంగా భయపె ట్టాడు. 31 ఏళ్ల హెడ్ మొత్తం సిరీస్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేసి 448 పరుగులు చేశాడు. ఈ క్రమంలో అతని బ్యాట్ నుంచి రెండు సెంచరీలు వచ్చాయి. న్యూ జిలాండ్‌పై హెడ్ పెద్దగా విజయాన్ని కనబరచలేకపోయాడు. కానీ, టీమ్ ఇండియా బౌలర్లు అతనిని అడ్డుకో వడంలో ఘోరంగా విఫలమయ్యారు. దీంతో హెడ్ ఫామ్ తిరిగి తెచ్చుకున్నాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ ఏడాది జూన్‌లో సౌతాఫ్రికాతో తలపడేందుకు ఆస్ట్రేలియా సిద్ధమైంది. ఈ క్రమంలో ట్రావిస్ హెడ్ ఓ కీలక విషయం వెల్లడించాడు. భారత్ తో 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ తర్వాత ట్రావిస్ హెడ్ ఓ కీలక విషయం తెలిపాడు. క్రికెట్‌పై దృష్టి పెట్టేందుకే మద్యపానానికి స్వస్తి చెప్పానని హెడ్ తెలిపాడు. సిరీస్ తర్వాత ఫాక్స్ స్పోర్ట్స్‌తో జరిగిన సంభాషణలో




హెడ్ మాట్లాడుతూ, 'రాబోయే కొద్ది రోజుల్లో నేను ఏమి చేస్తానో నాకు తెలియదు. మాకు 12 రోజుల సమయం ఉంది. శ్రీలంకకు బయలుదేరే ముందు, నేను ఖచ్చితంగా కొద్దిగా డ్రింగ్ చేస్తాను' అంటూ చెప్పుకొచ్చాడు. " భారత జట్టుతో సిరీస్ నాకు చాలా కష్టంగా ఉంది. ఇలాంటి మ్యాచ్ తర్వాత, నేను ఖచ్చితంగా ఏదైనా చల్లగా ప్రయత్నిస్తాను. గత కొన్ని రోజులుగా తాగడం లేదు' అంటూ ప్రకటించాడు. ఆస్ట్రేలియా ఇప్పుడు శ్రీలంకతో ఆడాల్సి ఉంది. ఇరు జట్ల మధ్య రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఉంది. ఆస్ట్రేలియా 2-0తో ఓడినా డబ్ల్యూటీసీపై ఎలాంటి ప్రభావం ఉండదు. బోర్డర్-గవాస్కర్ సిరీస్ గురించి మాట్లాడితే, మొదటి టెస్టులో భారత్ 295 పరుగుల తేడాతో విజయం సాధించగా, రెండో టెస్టులో ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య జరిగిన మూడో టెస్టు డ్రా కాగా, నాలుగో టెస్టులో ఆస్ట్రేలియా 184 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో పాటు 5వ టెస్టును ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో కైవసం చేసుకుంది.

## ఛాంపియన్స్ ట్రోఫీకి సిద్ధమైన శ్రేయాస్ అయ్యర్

**ముంబై:** వచ్చే నెల నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ సందడి మొదలు కానుంది. టోర్నమెంట్ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమ వుతుంది. దీని కోసం జట్లను ప్రకటించడానికి చివరి తేదీ జనవరి 12గా ఐసీసీ నిర్ణయించింది. ఈ ఐసీసీ టోర్నీకి భారత జట్టును కూడా త్వరలో ప్రకటించనున్నారు. కానీ, దేశవాళీ టోర్నీల్లో నిరంతరం రాణిస్తున్న ఆ ఆటగాడికి అందులో అవకాశం దక్కుతుందా అనేది పెద్ద ప్రశ్నగా మారింది. అతను ఇప్పటివరకు 5 టోర్నమెంట్లలో 1341 పరుగులు చేశాడు. అవును, ఇంతకుముందు గాయాలు, పేలవమైన ఫామ్‌తో ఆకట్టుకుంటోన్న శ్రేయాస్ అయ్యర్ గురించి మాట్లాడుతున్నాం. కానీ, 2024-25 దేశవాళీ సీజన్ బరిలోకి దిగిన శ్రేయాస్ అయ్యర్.. పరుగుల వర్షం కురిపిస్తున్నాడు. అయ్యర్ ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్నాడు. అక్కడ అతని బ్యాట్ పరుగులు చేయడం లేదు. విజయ్ హజారే ట్రోఫీలో ఇప్పటివరకు ఆడిన 5 ఇన్నింగ్స్‌ల్లో శ్రేయాస్ అయ్యర్ 325 సగటుతో 325 పరుగులు చేశాడు. ఈ సమయంలో




అతను 2 అర్ధ సెంచరీలు సాధించాడు. ప్రస్తుత విజయ్ హజారే ట్రోఫీ సీజన్‌లో అతని అత్యుత్తమ స్కోరు 137 పరుగులుగా నిలిచింది. కానీ, ఇది కేవలం టోర్నీ మాత్రమే. ఇంతకు ముందు ఆడిన ఇతర టోర్నీల్లోనూ శ్రేయాస్ అయ్యర్ ఫామ్ ఇలాగే ఉంది. రంజీ ట్రోఫీ అయినా, అతను 4 మ్యాచ్‌ల్లో 5 ఇన్నింగ్స్‌లలో 90.40 సగటుతో 2 సెంచరీలతో సహా 452 పరుగులు చేశాడు.



## తమీమ్ ఇక్బాల్ అద్భుతమైన ఇన్నింగ్స్

### 48 బంతుల్లో 86 పరుగులతో అజేయ ఇన్నింగ్స్

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం టీ20 లీగ్ హవా నడుస్తోంది. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌తో సహా ప్రపంచంలోని అనేక మంది ఆటగాళ్ళు పాల్గొంటున్న టీ20 లీగ్ అక్కడ తుది స్థాయికి చేరుకుంది. జనవరి 6న బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో రెండు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. అందులో ఒక జట్టు కెప్టెన్ 16 జట్లతో ఆడిన అనుభవం ఉంది. ఈ మ్యాచ్ ఫార్చ్యూన్ బరిషల్ వర్సెస్ దర్బార్ రాజ్‌షాహీ జట్టు మధ్య జరిగింది. ఫార్చ్యూన్ బారిసల్ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్‌కు 16 జట్లతో ఆడిన అనుభవం ఉంది. ఈ మ్యాచ్‌లో తమీమ్ అనుభవం అతని జట్టుకు చాలా ఉపయోగకరంగా మారింది. దాని కారణంగా అతని జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తమీమ్ ఇక్బాల్ తన జట్టుకు ద్విపాత్రాభినయం చేసి ముందుండి నడిపించాడు. ఓపెనర్‌గా వచ్చిన అతను తన జట్టు కోసం మ్యాచ్‌ను ముగించాడు. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడుతూనే, కెప్టెన్‌గా తన బాధ్యతను కూడా నెరవేర్చాడు. తమీమ్ ఇక్బాల్ రాజ్‌షాహీ జట్టుపై ఫార్చ్యూన్ బరిషల్‌కు సిక్సర్‌తో విజయాన్ని అందించాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన రాజ్‌షాహి జట్టు ఫార్చ్యూన్ బరిషాల్‌పై 20 ఓవర్లలో 169 పరుగుల విజయలక్ష్యంతో నిర్దేశించుకుంది. దీనిని ఛేదించేందుకు బ్యాటింగ్ ప్రారంభించిన తమీమ్ ఇక్బాల్ 48 బంతుల్లో 86 పరుగులతో అజేయంగా ఇన్నింగ్స్ ఆడాడు. 179 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో ఆడిన అతని ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 3 సిక్సర్లు ఉన్నాయి. తమీమ్ బ్యాట్ నుంచి వచ్చిన మూడో సిక్సర్ జట్టు గెలుపు స్క్రిప్ట్‌ను రచించింది. బంగ్లాదేశ్ దిగ్గజ ఆటగాళ్లలో తమీమ్ ఇక్బాల్ పేరు కూడా ఉంది. అతను తన దేశం తరపున అత్యధిక పరుగులు, అత్యధిక అంతర్జాతీయ సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్. బంగ్లాదేశ్ సీనియర్ జట్టు తరపున క్రికెట్ ఆడడమే కాకుండా, మరో 15 జట్లకు క్రికెట్ ఆడిన అనుభవం ఉంది. అందులో ఒకటి ఫార్చ్యూన్ బరిషల్.

# నా కెరీర్‌కు గేమ్ ఛేంజింగ్!

**- అంజలి**



'గేమ్ ఛేంజర్' తన కెరీర్‌లోనే అత్యుత్తమ చిత్రంగా నిలుస్తుంది"ని చెబుతోంది నటి అంజలి. ఈ చిత్ర కథా నేపథ్యం చాలా కొత్తగా ఉంటుందని.. దీంట్లో తను పోషించిన పార్వతి పాత్రను చేసేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందని తెలిపింది. ఇప్పుడామె.. రామ్‌చరణ్‌తో కలిసి నటించిన పాన్ ఇండియా చిత్రమే 'గేమ్ ఛేంజర్'. కియారా అద్వాణీ మరో నాయిక. శంకర్ దర్శకత్వంలో ముస్తాబైన ఈ సినిమా ఈ నెల 10న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది అంజలి.

'ఓ నిజాయతీ గల ఐఏఎస్ అధికారికి.. అవినీతి పరుడైన మంత్రికి మధ్య జరిగే పోరే ఈ చిత్ర కథాంశం. దీంట్లో యాక్షన్, ఎమోషన్ అంశాలతో పాటు బలమైన సందేశం దాగి ఉంటుంది. రామ్‌చరణ్ (%=ఖఎ జష్ట్రుతీఖఅ%) ఈ సినిమాలో అప్పన్న, రామ్ నందన్‌గా రెండు పాత్రల్లో కనువిందు చేస్తారు. నేను అప్పన్న భార్యగా పార్వతి అనే పాత్రలో కనిపిస్తా. కథను మలుపు తిప్పే పాత్రిది. నా పాత్రలో చాలా సోల్ ఉంటుంది. దాని గురించి ఎక్కువ బయట పెట్టొద్దనే టీజర్, ట్రైలర్లలో ఎక్కువ సీన్స్ పెట్టలేదు. నా పాత్రను తెరపై చూసినప్పుడు ప్రేక్షకులు థ్రిల్ ఫీలవుతారు. అప్పన్న, పార్వతిల ప్రేమ, వారిద్దరి బంధం గొప్ప అనుభూతిని అందిస్తుంది. అదే ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది'. ఏ యాక్టర్ అయినా బయట చూసే సంఘటనలు, తమకెదురైన అనుభవాల నుంచే తెరపై నటించేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ, ఈ చిత్ర నేపథ్యం.. ఇందులోని మనుషులు, జరిగిన ఘటనలు నిజ జీవితంలో నాకెప్పుడూ ఎదురు కాలేదు. చాలా కొత్తగా చూస్తున్నట్లు అనిపించింది. అందుకే ఈ సినిమాలో నా పాత్రను పోషించేందుకు.. సహజమైన నటనతో ప్రేక్షకుల్ని కట్టిపడేసేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. అంతేకాదు ఈ పాత్రలో ఆశ్చర్యపరిచే ట్విస్ట్‌లు కొన్ని ఉన్నాయి. అవేంటన్నది తెరపై చూసే తెలుసుకోవాలి'. 'దర్శకుడు శంకర్ నాకీ కథ, పాత్ర గురించి చెప్పగానే మా అమ్మే గుర్తొచ్చింది. ఎందుకంటే ఆమె పేరు కూడా పార్వతినే. ఈ పాత్ర నా ఆలోచనా ధోరణిని పూర్తిగా మార్చేసింది. ఈ సినిమా ప్రయాణంలో నన్ను నేను చాలా మార్చుకున్నాను. ఇకపై నేను ఎంచుకునే పాత్రలు.. సినిమాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సి వస్తుంది. ఆ విషయంలో ఇది నా కెరీర్‌కు గేమ్ ఛేంజింగ్ చిత్రమని చెప్పొచ్చు. చిరంజీవి ఈ చిత్రం చూసి.. నా పాత్రను మెచ్చుకున్నారని తెలిసింది. అదే నాకు పెద్ద అవార్డులా అనిపిస్తోంది. నేను ఈ కథ విన్నప్పుడు నాకిది జాతీయ అవార్డును అందించే పాత్ర అనిపించింది. ఇప్పుడు అందరూ అనుకున్నట్లుగా అదే నిజమైతే అంతకంటే గొప్ప విజయం మరేదీ ఉండదు. అది నిజం కావాలని కోరుకుంటున్నా'. 'రంగస్థలం' తర్వాత నటుడిగా రామ్‌చరణ్‌కు మళ్లీ అంత పేరు తెచ్చే సినిమా ఇది. ఇందులో ఆయన రెండు పాత్రల్ని అద్భుతంగా పండించారు. ముఖ్యంగా అప్పన్న పాత్ర ప్రత్యేకంగా గుర్తుండిపోతుంది. ఈ సినిమాలో మా ఇద్దరిపై వచ్చే "అరుగు మీద" పాట అందర్నీ అలరిస్తుంది. ప్రస్తుతం నేను 'ఈగై' అనే సినిమాతో పాటు నివిన్ పౌలితో ఓ చిత్రం చేస్తున్నా. తెలుగులో కొన్ని చిత్రాలు ఒప్పుకున్నా' అన్నారు.




## గేమ్ ఛేంజర్ నుంచి మరో సాంగ్ రిలీజ్

మెగా హీరో రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ గేమ్ ఛేంజర్ మరో రెండు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా వస్తుండటంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. దిగ్గజ దర్శకుడు శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ నుంచి మెలోడి సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. "అలికి పూసిన అరుగు మీద కలికి సుందరినై కూసుంటే పలకరించవేంది ఓ దొర. చిలక ముక్కు చిన్ని నా దొరా". అంటూ ఈ మెలోడి ఉండగా.. రామ్ చరణ్ అంజలిపై ఈ పాటను చిత్రీకరించినట్లు తెలుస్తుంది. ఈ పాటకు కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించగా.. థమన్, ఎస్ రోషిని జేకెవీ కలిసి పాడారు. థమన్ సంగీతం అందించాడు. ఇప్పటికే జరగండి.. జరగండి, ధోప్, రా మచ్చా సాంగ్‌లతో దూసుకుపోతున్న ఈ చిత్రంకి మెలోడి జత కావడంతో సూపర్ హిట్ కాయం అంటున్నారు అభిమానులు.



## ఈఫిల్ టవర్ ముందు అడివిశేష్

టాలీవుడ్ యాక్టర్ అడివిశేష్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోతుంది టైటిల్ రోల్ పోషించిన గూఢచారి. ఈ ఫ్రాంఛైజీలో జీ2 కూడా వస్తుందని తెలిసిందే. మేజర్ చిత్రానికి ఎడిటర్‌గా పనిచేసిన వినయ్ కుమార్ సిరిగినీడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా గన్స్ యాక్షన్ మూడ్‌లోకి దిగితే.. అంటూ ఇప్పటికే సినిమాపై సూపర్ క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు. తాజాగా ఈ చిత్ర టీంలోకి బేబిజాన్ నటి వామికా గబ్బి వచ్చేసింది. మిషన్‌లో భాగంగా సూట్‌లో ఉన్న అడివిశేష్, వామికా ఈఫిల్ టవర్ ముందు కనిపిస్తుండటం తాజా లుక్‌లో చూడొచ్చు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన జీ2 ఫస్ట్ లుక్ పోస్టర్‌తోపాటు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియో సినిమాపై అంచనాలు పెంచుతోంది. అడివి శేష్‌ను సీక్వెల్‌లో స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో చూపిపించబోతున్నట్టు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియోతో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు. జీ2 తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ విడుదల కానుంది.

## ఆంధ్రాకు సినిమాలంటే... తెలంగాణకు కల్లు, మటన్ అంటే ప్రాణం : దిల్‌రాజ్



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్‌ను లాంచ్ చేయగా మంచి స్పందన వస్తోంది. ఈ ఈవెంట్‌లో దిల్ రాజు చేసిన కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. తెలుగు రాష్ట్రాల్లో సినీ జనాలు సినిమాలను ఏ స్థాయిలో ఆదరిస్తారో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రత్యేకించి తెలంగాణలో భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా టాలెంట్ ఉన్న ప్రతీ నటీనటులు, టెక్నీషియన్లకు ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారు. అయితే ఈవెంట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ.. 'మావోళ్లకు సినిమా కంటే.. మన దగ్గర సినిమాలు తక్కువ కాబట్టి మీ దగ్గర నుంచి రియాక్షన్ తక్కువ వస్తుందని మా డైరెక్టర్‌కు చెప్పా. ఆంధ్రాకు వెళ్తే సినిమాకు ఒక వైబ్ ఇస్తరు. మన దగ్గర అయితే తెల్ల కల్లు, మటన్‌కు వైబ్ ఇస్తమని (నవ్వుతూ)' అన్నారు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

## ఆ నోటీసులు అవాస్తవం
### ప్రకటన విడుదల చేసిన చంద్రముఖి నిర్మాణ సంస్థ

లేడీ సూపర్ స్టార్ నయనతారకు చెందిన డాక్యుమెంటరీ వివాదంలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. చంద్రముఖి నిర్మాతలు నయన్‌కు లీగల్ నోటీసులు ఇచ్చారంటూ నిన్నటి నుంచి తెగ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా 'చంద్రముఖి' చిత్రంలోని కొన్ని సన్నివేశాలను వాడుకున్నందుకు నయన్ సహా ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌కు రూ.5 కోట్లు చెల్లించాలంటూ లీగల్ నోటీసులు జారీ చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అయితే, ఈ వార్తలపై 'చంద్రముఖి' సినీ నిర్మాణ సంస్థ శివాజీ ప్రొడక్షన్స్ తాజాగా స్పందించింది. నయన్‌కు తాము ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని సదరు నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీలో 'చంద్రముఖి' సినిమాలోని సన్నివేశాలను తమ పర్మిషన్ తీసుకొనే వినియోగించుకున్నారని స్పష్టం చేసింది. మెంత్తం 17 సెకన్ల సన్నివేశాలను రౌడీ పిక్చర్స్ సంస్థ వాడుకోవచ్చుని, దీనిపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. ఈ మేరకు గతేడాది నవంబర్‌లో జారీ చేసిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను మీడియాకు విడుదల చేసింది. ఈ ఎన్‌వోసీని మనోబాల విజయబాలన్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.



## 'స్క్విడ్ గేమ్'లో స్టార్ హీరోలు
### వీడియో వైరల్

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'స్క్విడ్ గేమ్'. ఈ కొరియన్ వెబ్‌సిరీస్ ఇప్పటికే రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హ్వాంగ్ డాగ్ హ్యూక్ దర్శకత్వంలో వచ్చిన ఈ సిరీస్‌లో డబ్బు కోసం సగటు మనిషి ఆడే నెత్తుటి ఆటను ఆసక్తికరంగా చూపించారు. ఆటలు ఆడేందుకు వచ్చిన **456** మందిని ఒక దీవికి తీసుకువెళ్లి అక్కడ చిన్నపిల్లలు ఆడుకునే రెడ్‌లైట్, గ్రీన్‌లైట్, టగ్ ఆఫ్ వార్ వంటి ఆటలు నిర్వహిస్తారు. అక్కడ వారంతా ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారు అనే కథాంశం ఆధారంగా వచ్చిన ఈ సిరీస్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అయితే, ఈ 'స్క్విడ్ గేమ్'లో ఇండియన్ సినీ స్టార్స్ పాల్గొంటే ఎలా ఉంటుంది..? ఈ ఆలోచనతోనే ఓ నెటిజన్ ఏఐ సాయంతో వీడియోను రూపొందించారు. స్టార్ నటులు జూనియర్ ఎన్టీఆర్, దళపతి విజయ్, రజినీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి,



మోహన్‌లాల్, నాగార్జున, నాగచైతన్య, సూర్య, మహేశ్‌బాబు, ధనుష్, విజయ్ దేవరకొండ, అల్లు అర్జున్, ప్రభాస్, పవన్ కల్యాణ్, అజిత్, యష్, రామ్ చరణ్, దుల్కర్ సల్మాన్, రానా, హృతిక్ రోషణ్ తదితరులు 'స్క్విడ్ గేమ్' సిరీస్‌లోని ఆటగాళ్ల దుస్తుల్లో కనిపించారు. 'స్క్విడ్ గేమ్ ఇండియా' పేరుతో విడుదల చేసిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.


Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**